


సాయి
# సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 59 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- సోమవారం - 19 - మే - 2025

## తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్...!




- అద్దె పద్ధతిలో థియేటర్లు నడపలేమని డిస్ట్రిబ్యూటర్లు స్పష్టీకరణ
- వసూళ్లలో వాటా (పర్సంటేజీ) విధానం అమలు చేయాలని డిమాండ్
- దిల్ రాజు, సురేష్ బాబుతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఎగ్జిబిటర్ల భేటీ
- నిర్మాతలకు లేఖ ద్వారా తమ నిర్ణయం తెలియజేయాలని తీర్మానం

## హైదరాబాదులో మరో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్‌లో ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు

పాతబస్తీ మీర్‌చౌక్‌లో జరిగిన ఘటనలో 17 మంది దుర్మరణం



- మైలార్‌దేవ్‌పల్లిలో మూడంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు
- అక్కడ చిక్కుకున్న 53 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- క్షేమంగా బయటపడ్డవారిలో 20 మంది చిన్నారులు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో భారీ అగ్నిప్రమాదాలు తీవ్ర కలకలం రేపాయి. చార్మినార్ వద్ద గుల్జార్ హౌస్ లో జరిగిన ఘోర దుర్ఘటనలో మిగతా..2లో


## భారత సైన్యానికి కీలక అధికారాలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వం



- త్రివిధ దళాలకు అత్యవసర ఆయుధ కొనుగోలు అధికారాల మంజూరు
- సుమారు రూ.40,000 కోట్ల బడ్జెట్‌కు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం
- ఆయుధ నిల్వల భర్తీ, ఆధునిక ఆయుధాల సమీకరణే ప్రధాన లక్ష్యం
- పాక్‌తో ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ లో వ్యూహాత్మక విరామం నేపథ్యంలో ఈ నిర్ణయం
- 40 రోజుల్లో ఒప్పందాలు ఖరారు, ఏడాదిలోగా ఆయుధాల డెలివరీ పూర్తి

# పోలవరం ప్రాజెక్టుపై ప్రధాని మోదీ సమీక్ష..
# హాజరుకానున్న చంద్రబాబు, రేవంత్

- ముంపు ప్రాంతాల్లో ప్రజాసమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు గురించి మే 28న ఉన్నత స్థాయి సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.
- ఈ ప్రాజెక్టు నుండి తమ వాటాగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు 1.5 టిఎంసి అడుగులు, 5 టిఎంసి అడుగులు ఇవ్వాలి
- గోదావరి నది బ్యాక్ వాటర్స్‌లో రాష్ట్రం మునిగిపోవడంపై తెలంగాణ ఆందోళనలు లేవనెత్తుతోంది




అమరావతి : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శర వేగంగా కొనసాగు తున్నా యి. తాజాగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పోలవరం యాక్షన్‌ప్లాన్‌లోకి దిగబోతున్నారు. కేంద్రం జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చిన ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు గురించి మే 28న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు ప్రధాని మోదీ. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతో మిగతా..2లో

## తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను



- క్షీణించిన శాంతిభద్రతలకు ఈ ఘటనే నిదర్శనమన్న జగన్
- రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన
- పోలీసులపై అధికార పార్టీ నేతల తీవ్ర ఒత్తిడి: జగన్ ఆరోపణ
- ఫిర్యాదుదారులపైనే ఎదురు కేసులు బనాయిస్తున్నారన్న జగన్
- దాడి ఘటన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్

అమరావతి : తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు, బలహీన వర్గాలపై మిగతా..2లో

## గుల్జార్‌హౌస్ ప్రమాద ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు



- ప్రమాద ఘటన తీవ్రంగా కలిచివేసిందన్న ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- అలాగే గాయపడిన వారికి రూ. 50వేల పరిహారం ఇస్తామని వెల్లడి
- ఈ దుర్ఘటనపై సీఎం చంద్రబాబు సంతాపం

## కనివిని ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తాం..




అమరావతి : కడప నగరంలోని పబ్బాపురం దగ్గర నిర్వ హించనున్న తెలుగు దేశం పార్టీ (టీడీపీ) మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్షా సమావేశం నిర్వ హిం చింది. ఈ కార్యక్ర మంలో ఏపీ రాష్ట్ర టీడీపీ అధ్య క్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మిగతా..2లో

## నిజాం కాలం నాటి నక్షాలకు కూడా మోక్షం కల్పిస్తాం.. మంత్రి పొంగులేటి ప్రకటన



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో తరతరాలుగా నిజాం కాలం నుండి సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని.. గత పదేళ్లలో ఈ సమస్యకు బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు గాను 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన భేటీ

తన ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' ఆవిష్కరణకు ఆహ్వానం 2లో

హైదరాబాద్‌లో జరగనున్న తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమం

ఇటీవలే ఢిల్లీలో హిందీ ఆత్మకథ 'జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా' విడుదల

# "ఒకే దేశం - ఒకే ఎన్నికలు"
# దేశ అభివృద్ధిలో కీలకం

**దేశంలో మార్పు రావాలి అది మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుంది**

- స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నాం
- ప్రస్తుతం దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవా
- భవిష్య తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం , దీనికి అందరూ ప్రజలు సహకరించాలి




హైదరాబాద్ :"ఒకే దేశం - ఒకే ఎన్నికలు" దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా, హోటల్ కత్రియా లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు %డ% కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ... మిగతా..2లో

## జూన్ 1 నుంచి ఏపీలో చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ .. ఎండీయు వాహనాలపై మంత్రి నాదెండ్ల ఏమన్నారంటే..?



- రేషన్ ఎండీయూ వాహన వ్యవస్థ రద్దు చేస్తున్నారంటూ ప్రచారం
- జూన్ 1 నుంచి ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ అంటూ వార్తలు
- రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నామన్న మంత్రి నాదెండ్ల మనోహర్


అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని, మిగతా..2లో

## హైదరాబాద్‌లో పేలుళ్లకు విజయనగరంలో ప్లాన్..
## తెలంగాణ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ సక్సెస్!

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో పేలుళ్లకు కుట్ర జరిగింది. ఈ విషయం తెలిసి.. తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ టీమ్ అలర్ట్ అయ్యింది. కుట్ర చేసిన వారిని కట్టడిచేసి పట్టుకుంది. నిందితులు విజయనగరానికి చెందిన వారిగా గుర్తించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లో పేలుళ్లకు విజయనగరంలో ప్లాన్

తెలంగాణ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర పన్నిన వారికి.. బిగ్ ట్విస్ట్ ఇచ్చారు మన పోలీసులు.



2లో

## గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం : 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన రేవంత్ సర్కార్!




హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్ లో నేడు ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. చార్మినార్ సమీపంలో గుల్జార్ హౌస్ వద్ద చోటు చేసు కున్న అగ్ని ప్రమాదం 17 మంది ప్రాణా లను బలిగొన్న దుర్ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఇప్పటికే ఈ దుర్ఘటనపై తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబుతో పాటు భారత ప్రధాని మోదీ స్పందించారు. తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

తెలంగాణా ప్రభుత్వం 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన

ఇప్పటికే కేంద్రం మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. తాజాగా గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మిగతా..2లో

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక www.saisuryaa.com
సోమవారం - 19 - మే - 2025

## తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్...!

అమరావతి : తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సినిమా ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతమున్న అద్దె (రెంటల్) పద్ధతిలో థియేటర్లను నడపడం తమకు సాధ్యం కావడం లేదని, కేవలం సినిమా వసూళ్లలో వాటా (పర్సంటేజీ) పద్ధతిని అమలు చేస్తేనే థియేటర్లను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.˚జు (ఆదివారం) హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్ల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, డి. సురేష్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్లు తమ సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను నిర్మాతలకు వివరించినట్లు సమాచారం. థియేటర్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని, అద్దె పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. "అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇకపై నడిపించలేం. మాకు పర్సంటేజీ రూపంలోనే వాటా కావాలి. అప్పుడే మాకు గిట్టుబాటు అవుతుంది," అని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు తమ డిమాండ్లను, నిర్ణయాన్ని వివరిస్తూ నిర్మాతలకు అధికారికంగా ఒక లేఖ రాయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, జూన్ 1 నుంచి విడుదల కావాల్సిన పలు సినిమాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా చిత్రాల విడుదలకు ఇబ్బందులు తలెత్తవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో తెలుగు సినిమా పరిశ్రమలో కొత్త చర్చ మొదలైంది. ఈ సమస్యకు నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి ఎలాంటి పరిష్కారం కనుగొంటారో చూడాలి.

## హైదరాబాదులో మరో భారీ అగ్నిప్రమాదం

మొదటి పేజి తరువాయి

17 మంది సజీవ దహనం కాగా, మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన మరో ప్రమాదంలో 53 మందిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా కాపాడారు. ఈ రెండు ఘటనలతో నగరవాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

మైలార్‌దేవ్‌పల్లిలో తప్పిన పెను ముప్పు... 53 మంది సేఫ్

నగర శివార్లలోని మైలార్‌దేవ్‌పల్లిలో అగ్నిప్రమాదం జరిగింది. ఇక్కడ ఒక మూడంతస్తుల భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో భవనంలో సుమారు 53 మంది నివసిస్తున్నారు. భవనం నుంచి కిందకు దిగే ప్రధాన మెట్ల మార్గం వద్దే మంటలు భారీగా ఎగిసిపడటంతో వారంతా పై అంతస్తుల్లో చిక్కుకుపోయారు. ప్రాణభయంతో టెర్రస్‌పైకి చేరుకుని ఆర్తనాదాలు చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి, లాడర్ల సహాయంతో టెర్రస్‌పై ఉన్నవారిని సురక్షితంగా కిందకు దించారు. రెండో అంతస్తులో చిక్కుకున్న మరికొందరిని మెట్ల మార్గం ద్వారా కిందకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి, భవనంలో చిక్కుకున్న మొత్తం 53 మందిని ప్రాణాలతో కాపాడారు. వీరిలో 20 మంది చిన్నపిల్లలు కూడా ఉండటం గమనార్హం. సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పిందని, అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## గుల్జార్‌హౌస్ ప్రమాద ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ : ఆదివారం ఉదయం చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురి కలిచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ప్రధాని... క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50వేల పరిహారం ఇస్తామని తెలిపారు. కాగా, గుల్జార్‌హౌస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఇప్పటివరకు 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు ఉన్నారు. ఇవాళ ఉదయం భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది కాపాడి యశోద (మలక్‌పేట), ఉస్మానియా, డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రులకు తరలించారు.

సీఎం చంద్రబాబు సంతాపం : గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి... మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## కనివిని ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తాం..

మొదటి పేజి తరువాయి

కనివిని ఎరుగని రీతిలో మహానాడు నిర్వహించాలని నిర్ణయించాం అన్నారు. మహానాడు నిర్వహణపై కమిటీలు వేశాం.. మహానాడు నిర్వహణలో 13 కమిటీలు కీలకంగా వ్యవహరించబోతున్నాయి.. ఆ 13 కమిటీల సలహాలు, సూచనలను క్రోడీకరించి ఒక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. నెవర్ బిఫోర్, నెవర్ ఆఫ్టర్ అనే విధంగా మహానాడు కార్యక్రమం నిర్వహించబోతున్నాం అని పల్లా శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. ఇక, కడపలో అకామీడేషన్ సమస్య ఉందని అందరూ అనుకున్నారు అని రాష్ట్ర టీడీపీ అధినేత పల్లా శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కానీ, ఎప్పుడు ఇంత పెద్ద ప్రాంగణంలో మేము మీటింగ్ నిర్వహించలేదు.. మొదటి రెండు రోజులు ప్రతినిధుల సభ నిర్వహిస్తాము.. 23,000 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపంచాం.. మూడవ రోజు ఐదు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించబోతున్నాం.. రాయలసీమ సెంట్రిక్ గా ఏవైతే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామో వాటిపై ప్రధానంగా చర్చిస్తాం.. టీడీపీ అంటేనే బడుగు బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం కలిగించిన పార్టీ.. తెలంగాణలో కూడా టీడీపీ మూలలు ఉన్నాయని పల్లా శ్రీనివాసరావు అన్నారు.


## తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను

మొదటి పేజి తరువాయి

దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయింది. చంద్రబాబు, అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్ష సాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లకు వెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదుదారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి. తిరుపతి ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ జగన్ ట్వీట్ చేశారు.

## పోలవరం ప్రాజెక్టుపై ప్రధాని మోదీ సమీక్ష.. హాజరుకానున్న చంద్రబాబు, రేవంత్

మొదటి పేజి తరువాయి



సంభాషించనున్నట్లు . పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై ప్రధాని మోదీ తొలిసారి సమీక్ష జరుపనున్నారు. ముంపు ప్రాంతాల్లో ప్రజాసమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించడంపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు దిశానిర్దేశం చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, పోలవరం ప్రాజెక్టు నీటిని నిలుపుకోవడం ప్రారంభించిన తర్వాత గోదావరి నది బ్యాక్ వాటర్స్‌లో రాష్ట్రం మునిగిపోవడంపై తెలంగాణ ఆందోళనలు లేవనెత్తుతోంది. ఈ ఆందోళనలను జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం దృష్టికి గతంలో తీసుకెళ్లింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ కూడా ఇలాంటి ఆందోళనలను వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్‌లో భాగస్వామ్యులైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య పంచుకునే నీటితో గోదావరి నుండి 80 టిఎంసి అడుగుల నీటిని కృష్ణా నదికి మళ్లించడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు నుండి తమ వాటాగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు 1.5 టిఎంసి అడుగులు, 5 టిఎంసి అడుగులు ఇవ్వాలి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ప్రాధాన్యతగా చేపట్టిన ప్రాజెక్టులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను గైడ్ చేసేందుకు పీఎం ప్రగతి కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేపట్టారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ కోసం 4 రాష్ట్రాల్లో ముంపు ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ, భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కల్పన, పనుల పురోగతిని సమీక్షించనున్నారు. గడువులోగా పనులన్నీ పూర్తి చేయడంపై ప్రధాని ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి తోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

# భారత సైన్యానికి కీలక అధికారాలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ : పాకిస్థాన్ తో ఇటీవలి ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతుండడం వంటి అంశాల నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం సాయుధ బలగాలకు కీలక అధికారాలను అప్పగించింది. అవసరమైన ఆయుధాలు కొనుగోలు చేసేందుకు ఆర్మీకి ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. సుమారు రూ.40,000 కోట్ల పరిమితితో అత్యవసర ఆయుధ సేకరణ (ఎమర్జెన్సీ ప్రొక్యూర్‌మెంట్ - ఈపీ) అధికారాలను త్రివిధ దళాలకు కల్పిస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) కొద్ది రోజుల క్రితమే ఆమోదముద్ర వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తాజా నిర్ణయం (ఈపీ-6) ద్వారా ఆర్మీ, వైమానిక దళం (ఐఏఎఫ్), నౌకాదళం తమ ఆయుధ నిల్వలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ఖాళీ అయిన వాటిని తిరిగి భర్తీ చేసుకోనున్నాయి. గతంలో తూర్పు లఢఖ్‌లో చైనాతో సైనిక ఘర్షణల సమయంలో తొలి నాలుగు దఫాలుగా, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కోసం ఐదో దఫా అత్యవసర కొనుగోలు అధికారాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఆరో విడత అధికారాల కింద, సాయుధ దళాలు సాధారణంగా అనుసరించే సుదీర్ఘమైన సేకరణ ప్రక్రియలకు బదులుగా, వేగవంతమైన పద్ధతిలో ఒక్కొక్కటి రూ.300 కోట్ల విలువైన బహుళ ఒప్పందాలను ఖరారు చేసుకోవచ్చు. ఈ కొనుగోళ్లను మూలధన, రెవెన్యూ పద్దుల కింద చేపట్టే వెసులుబాటు కల్పించారు. "ఒప్పందాలను 40 రోజుల్లోగా ఖరారు చేయాల్సి ఉంటుంది, ఏడాదిలోగా ఆయుధాల డెలివరీ పూర్తి కావాలి. ఈ అధికారాలను త్రివిధ దళాల వైస్ చీఫ్‌లు వినియోగిస్తారు" అని ఓ అధికారి తెలిపారు. ఈ అత్యవసర అధికారాలతో క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, నిఘా మరియు కచ్చితత్వంతో దాడులు చేయగల మందుగుండు సామగ్రి, కమికాజే డ్రోన్లు, డ్రోన్ వ్యతిరేక వ్యవస్థలు వంటి అధునాతన ఆయుధాలను, ఇతర మందుగుండు సామాగ్రిని సాయుధ దళాలు వేగంగా సమకూర్చుకోనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన మొత్తం రక్షణ బడ్జెట్‌లో మూలధన, రెవెన్యూ సేకరణలపై ఒక్కొక్కదానిపై 15% పరిమితి ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల పాక్ తో ఘర్షణల సమయంలో భారత వైమానిక దళ విమానాలు కచ్చితమైన దాడుల కోసం రష్యాతో కలిసి భారత్‌లో ఉత్పత్తి చేస్తున్న బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, ఇజ్రాయెల్ తయారీ ఎయిర్-టు-గ్రౌండ్ క్రిస్టల్ మేజ్-2, రాంపేజ్ క్షిపణులు, స్పైస్-2000 ప్రెసిషన్ గైడెడ్ బాంబులు, ఫ్రెంచ్ తయారీ స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ ఎయిర్-టు-గ్రౌండ్ ప్రెసిషన్ గైడెడ్ మందుగుండు సామగ్రిని ఉపయోగించాయి. అలాగే, ఇజ్రాయెల్ తయారీ హారోప్, హార్పీ కమికాజే డ్రోన్లను కూడా ఐఏఎఫ్ ప్రయోగించింది. ఇదే రీతిలో, ఆర్మీ విభాగాలు స్మెర్చ్/స్కైస్ట్రైకర్ వంటి లాంచింగ్ మందుగుండు సామగ్రితో పాటు, ఎక్సాలిబర్ వంటి 'స్మార్ట్' ఎక్స్‌టెండెడ్ రేంజ్ ఆర్టిలరీ షెల్స్‌ను నిర్దిష్ట లక్ష్యాలపై ప్రయోగించాయి. బహుళస్థాయి గగనతల రక్షణ వ్యవస్థలో భాగంగా, ఇజ్రాయెల్‌తో కలిసి అభివృద్ధి చేసిన బరాక్-8 మధ్యశ్రేణి ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు, స్వదేశీ ఆకాశ్ క్షిపణులతో సహా అనేక రకాల ఆయుధాలను సాయుధ దళాలు వినియోగించాయని సమాచారం.

## నిజాం కాలం నాటి నక్షాలకు కూడా మోక్షం కల్పిస్తాం.. మంత్రి పొంగులేటి ప్రకటన

మొదటి పేజి తరువాయి

పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫీడ్ బ్యాక్‌ను బట్టి మిగిలిన గ్రామాల్లో కూడా చేపడతామన్నారు.

పైలెట్ గ్రామాలు : మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి(కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్దతులలో విస్తృత సర్వే జరుగుతుందని, ఏరియల్/ డ్రోన్ సర్వే పద్ధతి, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్దతుల్లో సర్వే చేసి జియో రిఫరెన్స్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారుచేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుంది, ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రీ సర్వే కోసం వివిధ రాష్ట్రాలలో రీసర్వేలో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసీ టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. పైలట్ గ్రామాల్లో ఈ సంస్థలు రీసర్వే చేస్తాయని, సర్వే ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాలకు విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని వాడుకుని శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన ఆత్మకథ తెలుగు అనువాదం 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా దత్తాత్రేయ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.సీనియర్ రాజకీయ నాయకుడైన బండారు దత్తాత్రేయ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఈ ఆత్మకథను రచించారు. ఈ పుస్తకం ఇప్పటికే హిందీలో 'జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా' పేరుతో విడుదలైంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఈ హిందీ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు తెలుగు పాఠకుల కోసం 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దీనిని తీసుకువస్తున్నారు.హైదరాబాద్‌లో జరగబోయే ఈ తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ స్వయంగా కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.


## "ఒకే దేశం - ఒకే ఎన్నికలు"దేశ అభివృద్ధిలో కీలకం

మొదటి పేజి తరువాయి

స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నామని, ప్రధాని మోదీ ఎప్పుడు చెబుతుంటారు ప్రస్తుతం దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాలని, దానికి అనుగుణంగా కొన్ని మార్చుకున్నాం. కానీ దురదృష్టం ఏంటంటే మార్చే క్రమంలో వాటికి అడ్డంపడే ప్రయత్నం జరుగుతా ఉంటుంది అని అన్నారు. దాంట్లో భాగంగానే వన్ నేషన్ , వన్ ఎలక్షన్ సంబంధించి ప్రజల్లో చైతన్య నింపాలనీ , ప్రజల మధ్యకు వెళ్లి ప్రజలను చైతన్యం చేయడానికి ప్రయత్నం చేయాలని ప్రధాని మోడీ చెబుతూ ఉంటారు అని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల మీద మేధావుల మీద విశ్లేషకుల మీద ఒత్తిడి తీసుకురావాలి ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారాలన్నారు. దేశంలో ఎక్కడ ఎలక్షన్ జరిగిన దేశమంతా చర్చ జరుగుతూ ఉంటుంది. కాబట్టి దీనివల్ల ఎన్నో పని గంటలు వృధా అవుతున్నాయి. ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి ఇలాంటి పరిస్థితి ఉండదు అని ప్రసంగించారు. దేశంలో మార్పు రావాలి అది మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుంది జీఎస్టీ విషయంలో కావచ్చు 370 ఆర్టికల్ విషయంలో కావచ్చు మోదీ గారి పట్టుదలతోనే అది సాధ్యమైంది ట్రిబుల్ తలక్ విషయంలో కూడా అదే నిజమైంది ఓట్ల కోసం ట్రిబుల్ తాళక్ కొనసాగించారు సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన అది కంటిన్యూ చేశారు %జూూూ%, న్యూ క్రిమినల్ యాక్ట్, తీసుకోచ్చింది మోదీ ప్రభుత్వమే అని కిషన్ రెడ్డి అన్నారు. నేడు దేశం యొక్క పరిస్థితులు దేశం యొక్క అభివృద్ధి దృష్ట్యా వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాల్సిందే ఎక్కడో ఒకచోట ఎప్పుడు ఎలక్షన్స్ ఉండడం వల్ల సిబ్బందికి ప్రభుత్వానికి ఇది అభివృద్ధికి అడ్డంకి గా మారింది ఒక్కసారి ప్రజలందరూ ఆలోచించాలి అని, భవిష్య తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం , దీనికి అందరూ ప్రజలు సహకరించాలి. మేధావులు అన్ని వర్గాలు ఆలోచించాలి ప్రజలు సహకరించాలి , ప్రజల్లో చర్చించండి ప్రజల్ని చైతన్యవంతం చేయండి అని సూచించారు. ఇది అన్ని వర్గాలకు సంబంధించిన అంశం అన్ని వర్గాలు చైతన్యంతో ఆలోచించండి ఇది కేవలం ఇక్కడ కూర్చొని మాట్లాడటం కాదు ప్రజల్లో అవగాహన తీసుకురండి అని పిలుపునిచ్చారు.

## గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం : 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన రేవంత్ సర్కార్!

మొదటి పేజి తరువాయి



మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతదేహాలను ఉంచిన ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలోని మార్చురీని సందర్శించిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ విషయాన్ని ప్రకటించారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటామని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క హామీ

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ ప్రాంతంలోని రెండు అంతస్తుల భవనంలో ఈ ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది పిల్లలు, ఆరుగురు మహిళలు సహా 17 మంది మరణించారు. ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడిన డిప్యూటీ ముఖ్యమంత్రి మృతుల కుటుంబాలకు అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తక్షణం స్పందించి అందరితో మాట్లాడారన్నారు.

గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం: చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీవ్రదిగ్భ్రాంతి, మృతుల వివరాలివే!

సంఘటనా స్థలాన్ని సందర్శించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి 8 మంది మరణించారని పోలీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్ తెలిపారు.మిగిలిన వారు చికిత్స పొందుతూ గాయాలతో మరణించారు. కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి కిషన్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత ప్రజలకు సహాయం అందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## జూన్ 1 నుంచి ఏపీలో చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ .. ఎండీయు వాహనాలపై మంత్రి నాదెండ్ల ఏమన్నారంటే..?

మొదటి పేజి తరువాయి

ఎండీయూ వాహన వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పలు ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సైతం సమావేశాలు నిర్వహించి రేషన్ షాపుల ద్వారానే ఇకపై రేషన్ పంపిణీ జరుగుతుందని, డీలర్లు సక్రమంగా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని సూచనలు చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయు వాహనాల వ్యవస్థను తొలగిస్తారని కూడా ప్రచారం జరిగింది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ఇంటింటికి రేషన్ పేరుతో ఏర్పాటు చేసినా ఆ వాహనాలు వీధి రేషన్‌గా మారిందని విమర్శించారు. ఎండీయూ వాహనాల వల్ల ప్రజలకు మేలు జరగకపోగా, ప్రభుత్వానికి అదనపు భారం అవుతోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో ఇంతకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలా, లేక ఎండీయూ వాహనాల వల్ల ఉపయోగకరంగా ఉందా అనే విషయంపై కార్డుదారుల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను సైతం సేకరించింది. అయితే దీనిపై ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ విషయంపై తాజాగా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ రేషన్ డెలివరీ (ఎండీయూ) వాహనాలు కొనసాగించాలా లేదా నిలిపివేయాలా అన్న విషయంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఓ మహిళ ఎండీయూ వాహనం వచ్చినప్పుడు ఇంటి వద్ద ఉండి సరుకులు తీసుకోవడం కుదరడం లేదని, మరో సారి వాహనం రాకపోవడంతో సరుకులు కోల్పోతున్నట్లు వాపోయింది. ఈ సందర్భంగా మంత్రి పై విధంగా వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో పేలుళ్లకు విజయనగరంలో ప్లాన్.. తెలంగాణ పోలీసుల స్పెషల్ ఆపరేషన్ సక్సెస్!

మొదటి పేజి తరువాయి

పక్కా ప్లానింగ్‌తో బ్లాస్ట్ చేద్దామనుకున్న విజయనగరానికి చెందిన సిరాజ్, సమీర్ అనే ఇద్దరు నిందితుల్ని.. స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు.


పేలుడు పధార్థాలు కొనుగోలు చేసి.. తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. సిరాజ్-సమీర్ కలసి హైదరాబాద్‌లో బ్లాస్ట్‌లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు. విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి.. హైదరాబాద్‌లో డమ్మీ బ్లాస్ట్‌కు ప్లాన్ చేశారని బయటపడింది. సౌదీ అరేబియా నుంచి ఐసిస్ మాడ్యూల్ సమీర్-సిరాజ్‌కు ఆదేశాలు ఇచ్చింది. బ్లాస్ట్‌లకు ప్లాన్ చేసిన ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకొని ముప్పును తప్పించారు.

బాంబు బెదిరింపు కాల్స్.. ఇప్పుడే కాదు.. గతంలోనూ హైదరాబాద్ నగరంలో పేలుళ్లకు కుట్రలు జరిగాయి. ఇటీవల ఆపరేషన్ సింధూర్ జరిగిన నేపథ్యంలోనూ.. బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు బెదిరింపు కాల్స్ రాగా.. పోలీసులు అలర్ట్ అయ్యి.. తనిఖీలు నిర్వహించారు. కానీ.. ఏం లభ్యం కాలేదు. ఆ తర్వాత ఓ స్కూలుకు బెదిరింపు కాల్ వచ్చింది.

పెరిగిన నిఘా.. పహల్గామ్‌లో పర్యాటకులను టెర్రరిస్టులు చంపిన తర్వాత.. దేశ వ్యాప్తంగా అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ నగరంలో నిఘా పెంచారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కోఠీ షాపింగ్ జోన్, మెట్రో స్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

సీక్రెట్ ఆపరేషన్.. భాగ్యనగరంలో ఉగ్రదాడులు జరగొచ్చని కేంద్రం హెచ్చరించింది. దీంతో తెలంగాణలోని అన్ని పోలీస్ విభాగాలు అలర్ట్ అయ్యాయి. ఈ క్రమంలోనే బాంబ్ బ్లాస్ట్‌కు ప్లాన్ చేస్తున్నారని సమాచారం కౌంటర్ ఇంటెలిజెన్స్ టీమ్‌కు సమాచారం అందింది. దీనిపై సీక్రెట్ ఆపరేషన్ చేపట్టారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి.. నిందితులను పట్టుకున్నారు. నిందితుల్లో ఒకరి తండ్రి పోలీస్ అధికారిగా తెలుస్తోంది.

## పవన్ రిక్వెస్ట్ కు సై- ఆ బెడదకు చెక్



అమరావతి : ఏపీకి కర్ణాటక ప్రభుత్వం ఆరు కుంకీ ఏనుగులను బహూకరించనుంది. ఈ నెల 21వ తేదీన బెంగళూరులోని వాటిని ఏపీకి అప్పగించనుంది కర్ణాటక. దీనికోసం బెంగళూరులోని విధానసౌధ వద్ద ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే హాజరుకానున్నారు.ఏపీ తరఫున అటవీ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తోన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇందులో పాల్గొననున్నారు. ఆయన సమక్షంలో కర్ణాటక ప్రభుత్వం ఈ ఆరు ఏనుగులను అప్పగించనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు మంత్రి ఈశ్వర్ ఖండ్రే వెల్లడించారు.రంజన్, దేవా, మాస్తి, కరుణ, కృష్ణ, అభిమన్యు అనే ఏనుగులు కర్ణాటక నుంచి ఏపీకి రానున్నాయి. రంజన్, దేవా, మాస్తి, కరుణ ఏనుగులను కొడగు జిల్లాలోని దుబారె ఎలిఫెంట్ క్యాంప్ నుంచి తరలించనున్నారు. కృష్ణ, అభిమన్యును శివమొగ్గ జిల్లాలోని సక్రెబైలు నుంచి తీసుకొస్తారు. తొలుత వాటిని చిత్తూరుకు తరలిస్తారు.ఇవన్నీ కూడా కుంకీ ఏనుగులు.

అంటే- ఇతర ఏనుగుల గుంపును ఇవి నియంత్రించగలుగుతాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అటవీ ఏనుగులు తరచూ జనావాసాల్లోకి రావడం పంట పొలాలను ధ్వంసం చేస్తోన్న నేపథ్యంలో.. వాటిని నియంత్రించడానికి ఈ కుంకీ ఏనుగులను ఏపీ ప్రభుత్వం తీసుకుని రానుంది.ఈ ఏనుగులతో పాటు వాటి మావటులు ఏపీకి వస్తారు. కొద్దిరోజుల పాటు ఇక్కడే ఉంటారు.

ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటం, ఆ ఏనుగుల గురించి అటవీ సిబ్బంది, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిన తరువాత వాళ్లు మళ్లీ స్వరాష్ట్రానికి తిరిగి వెళ్తారని తెలుస్తోంది. ఏనుగుల గుంపు జనావాసాలకు తరలిరావడం కర్ణాటకలో కూడా సర్వ సాధారణమే. చామరాజనగర, కొడగు, హసన్, మైసూరు, చిక్ మగళూరు వంటి జిల్లాల్లో అవి తరచూ గ్రామాలు, పంటపొలాలపై దండెత్తుతుంటాయి. అలాంటి సమస్య ఇక్కడా ఉన్నప్పటికీ- కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులను ఏపీకి తరలించడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి. గత ఏడాది ఆగస్టు 8వ తేదీన పవన్ కళ్యాణ్..

బెంగళూరులో సిద్ధరామయ్య, మంత్రి ఈశ్వర్ ఖండ్రేలను కలిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని అటవీ సిబ్బందికి, ఏనుగులను నియంత్రించే కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలని అప్పట్లో కోరారు. సెప్టెంబర్ 27వ తేదీన ఈశ్వర్ ఖండ్రే కూడా విజయవాడలో పవన్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏనుగుల అప్పగింతకు సంబంధించి ఈ రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం కుదరింది.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించు కోవాలి..
# సమాజోద్ధరణకు విద్యను ఉపయోగించాలి..

## రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.. సంబరంగా జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవం.




అనంతపురం : విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, సమాజోద్ధరణకు విద్యను ఉపయోగించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వ విద్యాలయంలో శనివారం 14వ స్నాతకోత్సవ కార్యక్రమం సంబరంగా జరిగింది. కార్యక్రమంలో కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ముందుగా జేఎన్టీయూ ఆర్డర్ కు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ కు జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, యూనివర్సిటీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. తదనంతరం ఆడిటోరియంలో 14వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ ఉప కులపతి ప్రొ.హెచ్.సుదర్శనరావు జేఎన్టీయూ ప్రగతి నివేదికను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజనీరింగ్ విశ్రాంత ప్రొఫెసర్ ప్రొ.ఎంఆర్. మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ కార్యదర్శి డా.ఎం.జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తర్వాత హైదరాబాద్ లారెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.సత్యనారాయణ చావా కు గౌరవ డాక్టరేట్ ను రాష్ట్ర గవర్నర్ ప్రధానం చేశారు. అనంతరం 41 మందికి బంగారు పథకాలను గవర్నర్ అందజేశారు. అందులో పూజిత్ కుమార్ రెడ్డి అత్యధికంగా ఆరు బంగారు పథకాలు, విద్యార్థిని సుప్రజా నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. అనంతపురం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవంలో తాను పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. శాస్త్రీయ, సాంకేతిక సవాళ్లను కొనసాగించే విద్యార్థుల సామర్థ్యం, మానసిక సామర్థ్యాన్ని ప్రదర్శించడమే కాక జ్ఞాన సమపార్జన, అభివృద్ధికి దోహదపడిందన్నారు. విద్యార్థుల విజయాలు, స్వంత సామర్థ్యాలను మాత్రమే కాకుండా, సహాయక తల్లిదండ్రులు, సలహాదారులు, స్నేహితుల ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తాయన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ ఫార్మసీలలో అసాధారణమైన విద్యను అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ సాంకేతిక విశ్వవిద్యాలయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని కొనియాడారు. అనంతపురం జె. ఎన్. టి. యు పరిధిలో అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయన్నారు. జేఎన్టీయూ స్థానిక యువతకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చిందన్నారు.. 2008లో ప్రారంభమైనప్పటి నుండి జేఎన్టీయూ అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడంలో నైపుణ్యం కోసం ప్రయత్నిస్తూనే ఉందన్నారు. నాణ్యమైన




విద్య,వైద్యం, ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన జీవితాన్ని అందించగలవన్నారు. వికసిత్ భారత్ చొరవ భారతదేశాన్ని స్వావలంబన-ఆత్మనిర్భర్ భారత్‌గా మార్చాలని చెబుతుందన్నారు.అదే సమయంలో ప్రపంచ వేదికపై కూడా ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు.. ఈ దృక్పథాన్ని సాధించడానికి, ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, పునరుత్పాదక ఇంధనం, స్టార్టప్‌లు, విద్య, ఆరోగ్యం నైపుణ్యాభివృద్ధి వంటి వివిధ రంగాలలో అనేక కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు.. పౌరులు, విద్యార్థులు, యువత అన్ని సంస్థలను ఈ కల కోసం చురుకుగా సహకరించడానికి ప్రోత్సహించే విధానం భాగస్వామ్యమైనదని గవర్నర్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర నేతృత్వంలోని రెండు కార్యక్రమాల ద్వారా వికసిత్ భారత్ విజన్ బలంగా అమలు చేయబడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన సంక్షేమం, అభివృద్ధి విద్యా విధానాలను జాతీయ ఫ్రేమ్‌వర్క్‌లతో అనుసంధానించిందన్నారు. పీఎం గతి శక్తి, పీఎం విశ్వకర్మ యోజన, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్, అమృత్ సరోవర్ ప్రాజెక్టులు వంటి అనేక ప్రధాన జాతీయ కార్యక్రమాలు రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయబడ్డాయన్నారు. ఆంధ్రప్రదేశ్ తన సౌర, పవన శక్తి సామర్థ్యాలను అనంతపురం, కడప జిల్లాల్లో ప్రాజెక్టుల ద్వారా వేగంగా విస్తరింపజేస్తోందన్నారు. సుస్థిర ఇంధనంపై వికసిత్ భారత్‌కు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పారిశ్రామికీకరణ మెరుగైన కనెక్టివిటీని పెంచడానికి విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ భారతమాల పరియోజన వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ యువతలో ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచడానికి మెగా జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ప్రైవేట్ పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తుందన్నారు.. ఎన్టీఆర్ వైద్య సేవ వంటి ప్రజారోగ్య పథకాలు ఆయుష్మాన్ భారత్ దృష్టిని పూర్తి చేస్తాయని, లక్షలాది మందికి అందుబాటు ధరలో ఆరోగ్య సంరక్షణను అందజేస్తాయన్నారు.. ఈ కార్యక్రమాల ద్వారా, 2047 నాటికి వికసిత్ భారత్-అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క పెద్ద లక్ష్యానికి దోహదం చేయడానికి ఆంధ్రప్రదేశ్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందన్నారు..జె.ఎన్. టి.యు. అనంతపురం రాష్ట్ర ప్రభుత్వంతో



అనుసంధానించబడిన వివిధ చర్యలను అమలు చేయడం ద్వారా వికసిత్ భారత్‌కు అపారమైన సహకారం, చొరవ అందిస్తోందన్నారు.

స్వర్ణ ఆంధ్ర 2047 అనేది వికసిత్ భారత్ యొక్క జాతీయ మిషన్‌ను పూర్తి చేసే రాష్ట్ర స్వంత విజన్ యని, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా పెట్టుబడులకు ప్రాధాన్యతనిచ్చే గమ్యస్థానంగా భావించే భావనను సాధించడానికి ఆంధ్రప్రదేశ్ రోడ్‌మ్యాప్, స్వర్ణ ఆంధ్రలో విద్య ఒక ప్రధాన స్తంభంగా నిలిచిందన్నారు. నైపుణ్యాభివృద్ధి కళాశాలలు, ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో పెట్టుబడులు పెట్టబడుతున్నాయన్నారు స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్, గ్రామీణ వెనుకబడిన ప్రాంతాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడాన్ని నిర్ధారిస్తూ, సమ్మిళిత అభివృద్ధి, ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుందన్నారు. పునరుత్పాదక ఇంధన పార్కులు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, క్లస్టర్లు సహజ వనరుల పరిరక్షణ వంటి గ్రీన్ ఎకానమీ చొరవలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ చొరవల ద్వారా, ఆంధ్రప్రదేశ్ ప్రపంచ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో తనను తాను సమలేఖనం చేసుకుంటూ, వృద్ధి సమానంగా పర్యావరణ అనుకూలంగా ఉండేలా చూసుకుంటోందన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 అనేది ఒక స్థిరమైన, సంపన్నమైన, ప్రగతిశీల రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రజా-కేంద్రీకృత దృష్టి పెడుతున్నాయని అన్నారు..

21వ శతాబ్దపు సవాళ్లు అవకాశాలకు యువతను సిద్ధం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్య సంస్కరణలపై బలమైన ప్రాధాన్యతనిస్తోందన్నారు.. జాతీయ విద్యా విధానం 2020 అమలు ఒక ప్రధాన చొరవ, ఇది కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో నాలుగు సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు, సౌకర్యవంతమైన ప్రవేశ నిష్క్రమణ ఎంపికలు, బహుళ-క్రమశిక్షణా కోర్సులు ఎంపిక-ఆధారిత క్రెడిట్ వ్యవస్థలను ప్రవేశపెట్టిందన్నారు. దృష్టి రొటీన్ లెర్నింగ్ నుండి నైపుణ్య అభివృద్ధి, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత ఆవిష్కరణలపై మళ్లిందన్నారు. అనంతపురం జె.ఎన్.టి.యు ఇప్పటికే ఎన్.ఈ.పి 2020 సిఫార్సులను అమలు చేసిందన్నారు. దాని ప్రయోజనాలను పొందుతోందని తెలుసుకుని తాను సంతోషిస్తున్నానన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో నైపుణ్యాభివృద్ధి కళాశాలల స్థాపన, విద్యార్థులకు పరిశ్రమ-సంబంధిత వృత్తి శిక్షణ, ఉపాధి నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏ.పి. ఎస్.ఎస్.డి.సి.కింద, లక్షలాది మంది విద్యార్థులు ఇప్పటికే ఐటీ, ఎలక్ట్రానిక్స్, తయారీ, ఆరోగ్య సంరక్షణ, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ పొందారన్నారు. కళాశాలల మౌలిక సదుపాయాల ఆధునీకరణ, మెరుగైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, హాస్టళ్లు, డిజిటల్ అభ్యాస సౌకర్యాలను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు.

భారతదేశ జాతీయ క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతిలో క్వాంటం వ్యాలీ అనే క్వాంటం కంప్యూటింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించిందన్నారు. భారతదేశంలో క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధికి రాష్ట్రాన్ని ప్రముఖ కేంద్రంగా స్థాపించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడం ఈ చొరవ ఉద్దేశించబడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవలో భాగం కావడానికి, రాబోయే విద్యా సంవత్సరం నుండి క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీని అందించడానికి జె.ఎన్. టి.యు అనంతపురం చర్యలు





ప్రారంభించిందని తెలిపారు.

ఇతర దేశాల్లోని ప్రఖ్యాత సంస్థలతో సహకారం ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. ఇది విద్యార్థులు వికసిత్ భారత్, స్వర్ణ ఆంధ్ర 2047 కు దోహదపడేలా చేస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా, "స్టార్టప్ ఒక సామాజిక సంస్కృతిగా మారిందన్నారు. సామాజిక సంస్కృతిని ఎవరూ ఆపలేరని, స్టార్టప్‌లు ఇంక్యుబేషన్ సెంటర్లు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించడం ద్వారా స్టార్టప్ రంగంలో ముందుకు రావడానికి వ్యక్తులు, సంస్థలకు మద్దతు ఇవ్వడం ద్వారా సమాజానికి తిరిగి ఇవ్వాలని ప్రధానమంత్రి స్టార్టప్‌లను కోరడం




జరిగిందన్నారు. అనంతపురం జె.ఎన్.టి.యు. రాష్ట్రంలో ఉద్భవించే స్టార్టప్‌లతో సంభాషించడం ద్వారా ఈ దిశలో నాయకత్వం వహించాలని గవర్నర్ కోరారు.

అనంతపురం జె.ఎన్.టి.యు దాని ఇంక్యుబేషన్ సెంటర్లు, ఇన్నోవేషన్






సెల్స్ ద్వారా, విద్యార్థులను వినియోగించుకుని అనుసరించడం కంటే సృష్టించి, నడిపించమని ప్రోత్సహిస్తుందన్నారు.. ఈ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించు కోవాలని, మార్గదర్శకులతో నెట్‌వర్క్ చేయాలని, ఆ మొదటి అడుగు వేయాలని కోరుతూ తాను కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నానన్నారు.. అందుబాటులో



ఉన్న అవకాశాలను పూర్తిగా ఉపయోగించు కోవాలన్నారు.

మనం ఇప్పుడు అల్, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ ద్వారా నడిచే నాల్గవ పారిశ్రామిక విప్లవంలో ఉన్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పురోగతికి అనుగుణంగా ఉండటానికి, విద్యార్థులు సంబంధిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని గవర్నర్ సూచించారు.

మీ అభ్యాసం సమాజ భాగస్వామ్యంగా మారనివ్వండని,గ్రామీణ భారతదేశం కోసం స్వచ్ఛందంగా ముందుకు సాగాలన్నారు.సరికొత్త ఆవిష్కరణలు చేసి స్థిరమైన పరిష్కారాలను నిర్మించాలన్నారు.ఈ గ్రామాల భూమిలో ఆవిష్కరణల ప్రభావం కార్పొరేట్ బోర్డు గదులను దాటి అట్టడుగు స్థాయి వరకు చేరుకోవాలని ఆయన అకాంక్షించారు.

గ్రాడ్యుయేట్ల ఆవిష్కరణ సమ్మిళితత్వం, రెండింటిలోనూ విజేతలుగా ఎదగాలన్నారు. మీ కోరికలను సాధించడంలో నిర్భయంగా ఉండాలని, ఏ వైఫల్యం కలిగినా నిరుత్సాహ పడకూడదన్నారు.

ధైర్యంగా అడుగు వేసి వినయంతో ముందుకు సాగాలన్నారు. అనంతపురం జె. ఎన్. టి. యు వారసత్వాన్ని గర్వంగా ముందుకు తీసుకెళ్లండని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ స్నాతకోత్సవంలో డిగ్రీపట్టాలు అందుకున్న విద్యార్థులు అందరికి రాష్ట్ర గవర్నర్, ఉప కులపతి అభినందనలు తెలిపారు.

అనంతరం జె. ఎన్. టి. యు. వైస్ చాన్సలర్ రాష్ట్ర గవర్నర్ ను శాలువాతో సత్కరించి మెమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, జేఎన్టీయూ రిజిస్టర్ కృష్ణయ్య, ఎంఎల్సి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డా.పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో కేశవ నాయుడు, యూనివర్సిటీ అధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, జేఎన్టీయూ పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు

# ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుంటే తీవ్ర పరిణామాలు

- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరిక
- కేంద్రం చర్యలతో ఆర్డీటీ మనుగడే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి
- ఎన్నికల సమయంలో ఆర్డీటీ చుట్టూ తిరిగిన రాజకీయ నేతలు
- ఎన్నికల తర్వాత మాటలకే పరిమితం అవుతున్న వైనం
-ఆర్డీటీ సేవలు ఆగిపోతుండడంతో నష్టపోతున్న పేదలు
-ప్రధాని మోదీతో భేటీలో ఆర్డీటీ సేవలను నారా లోకేష్ ప్రస్తావించాలి
- తక్షణం ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి
- సేవ్ ఆర్డీటీ పేరుతో తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- బ్రహ్మసముద్రంలో ర్యాలీని ప్రారంభించిన అనంత వెంకటరామిరెడ్డి




అనంతపురం : ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. "సేవ్ ఆర్డీటీ" పేరుతో శనివారం వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మసముద్రం నుంచి కళ్యాణదుర్గం వరకు చేపట్టిన ఈ ర్యాలీని బ్రహ్మసముద్రంలో అనంత వెంకటరామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఐదున్నర దశాబ్దాల క్రితం జిల్లాలో కరువు పరిస్థితులు, పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్డీటీని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించారు. ఏళ్ల తరబడి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని చూరగొంది. ఆర్డీటీ సంస్థ ఆరోగ్య పరంగా, విద్య పరంగా, పేదలను ఆదుకునే విషయంలో, కూలీలకు పనులు కల్పించడంలో, వాటర్‌షెడ్లను నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. క్రీడలను ప్రోత్సహించి ఎంతో మంది జాతీయ స్థాయికి వెళ్లేలా చేసింది. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఇలాంటి సంస్థపై మతసంస్థగా ముద్రవేసి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకుండా ఇబ్బంది పెడుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఎఫ్‌సీఆర్‌ఏను తాత్కాలికంగా రెన్యూవల్ చేశారు. అప్పట్లో కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నేత, ఇప్పటి మంత్రి సత్యప్రసాద్, టీడీపీ నాయకులు అంతా వెళ్లి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోఎన్డీయే ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కానీ ఆర్డీటీ కష్టాలను పట్టించుకోవడం మానేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయని కారణంగా ఆర్డీటీకి విదేశీ నిధులు ఆగిపోయాయి. అనేక సేవలకు అంతరాయం ఏర్పడింది. చివరకు ఆర్డీటీ సంస్థ ఇతర దేశాలకు వెళ్లిపోయే పరిస్థితిని తీసుకొస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో ఆర్డీటీ అనేక సేవలు చేసింది. సుమారు 3800 గ్రామాల్లో సేవ కార్యక్రమాలు చేస్తోంది. ఆర్డీటీ సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు ఉద్యమించే పరిస్థితి వచ్చింది. ఎన్డీయే ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రంలో చంద్రబాబు మాటలకే పరిమితం అవుతున్నారు. ఆర్డీటీని రక్షించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో తలారి రంగయ్య నాయకత్వంలో వైసీపీ నాయకులంతా ప్రజా ఉద్యమం చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేషలు అనంతపురం జిల్లాలో ఇటీవల పర్యటించారు. కానీ ఎక్కడా ఆర్డీటీకి భరోసా కల్పించేలా చర్యలు తీసుకోలేదు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ రోజు (శనివారం) ప్రధాని మోదీని నారా లోకేష్ కలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సేవలను మోదీకి తెలియజేసి తక్షణం ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలి" అని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, రఘునాథరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూరు, సూర్య టు డే (మే18): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వై ఏం తండా,చింత గట్టు తండా, సిద్ధాపూర్, ఎస్బిపల్లి గ్రామాలలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం ఎస్బి పల్లి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ చేసేదే చెబుతుందని, తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క వాగ్దానాన్ని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజల గురించి ఆలోచించని బి ఆర్ ఎస్ నాయకులు అధికారంలోకి వచ్చి కొద్దికాలమే అవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తుండటం విడ్డురంగా ఉందని అన్నారు. గత పాలనా కాలంలో గ్రామాలలో ఉండే కారు పార్టీ నాయకులు పెద్ద పెద్ద ఇండ్లు భవంతులు కట్టుకున్నారు కానీ పేదలు..ఇల్లు లేని వాళ్ల గురించి ఏనాడైనా ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని తెలిపారు. ఎస్ బీ పల్లి గ్రామస్తులు చిరకాల కోరికైనా పొలాలకు బీటీ రోడ్డు వేయడంను తొందర్లోనే ప్రారంభిస్తారని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగల్లా హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్ రెడ్డి,వీరమోని దేవేందర్ ముదిరాజ్,మామిడి సిద్దార్థ రెడ్డి,ఎమ్మె సత్తయ్య,విజయ్,ఎస్ బి పల్లి సురేష్,ప్రవీణ్,రవికుమార్ గుప్తా, దేవేందర్,మహేందర్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## పంజాగూడెం,మీరా న్పేట్ గ్రామాల మధ్య
## 13 గుంటల ప్రభుత్వ భూమిని గుర్తించిన అధికారులు



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 18 : రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని పంజాగుడం,మీరాన్పేట్ గ్రామాల మధ్య కందుకూరు మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ యాదగిరి, సర్వేయర్ సాయికాంత్ ఇతర అధికారులతో సర్వే నిర్వహించారు. గతంలో ఇదే భూమిలో ఏడి సర్వేయర్ అధికారి ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి 13 గుంటల ఎక్స్ టెంట్ గ్యాప్ ల్యాండ్ ఉన్నట్లు ఆర్డీవో నిర్ణయించడం జరిగిందని, మరొకసారి ఇక్కడ తాము సర్వే నిర్వహించి పంజాగుడెం రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 6, ఇంకా మీరా?న్ పెట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 331 భూముల మధ్య 13 గుంటల గ్యాప్ ల్యాండ్ ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, త్వరలోనే ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రభుత్వానికి చెందినట్లుగా గుర్తించబడే బోర్డులు ఏర్పాటు పక్కాగా చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.




## మాధురి-భారత్ కుమార్ వివాహ వేడుకల్లో
# పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంచాల, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 18: తుర్క యంజాల్ ఎస్ ఎస్ గార్డెన్ లో జరిగిన పటేల్ చెర్వుతండాకు చెందిన మేగవత్ రాందాస్ నాయక్ కుమార్తె వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు. నూతన దంపతులు మాధురి- భారత్ కుమార్ ను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్, ఆరుట్లమాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కావాలి శ్రీనివాస్ ముదిరాజ్(హోటల్) పంబాల బుగ్గరాములు, మాధగోని జంగయ్య గౌడ్, పటేల్ చెర్వు తండా కాంగ్రెస్ పార్టీ నాయకులు మేగవత్ రఘు నాయక్, మేగవత్ లక్ష్మణ్ నాయక్, మేగవత్ అర్జున్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష ఫలితాలకు బ్రేక్..
# స్టే విధించిన మద్రాస్ హైకోర్టు

**నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలకు బ్రేక్**

**మద్రాస్ హైకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు**

**మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ కూడా తాత్కాలిక నిలుపుదల**

**పరీక్షా కేంద్రంలో కరెంట్ కోతపై విద్యార్థుల పిటిషన్**

**జూన్ 2కు విచారణ వాయిదా వేసిన మద్రాస్ హైకోర్టు**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే విధిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో త్వరలో విడుదల కావాల్సిన ఫలితాల ప్రక్రియ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే, మే 4వ తేదీన జరిగిన నీట్ యూజీ 2025 పరీక్ష సందర్భంగా ఒక పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఈ వివాదానికి కారణమైంది. సరైన వెలుతురు లేకుండానే పరీక్ష రాయాల్సి వచ్చిందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ 13 మంది విద్యార్థులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పరీక్ష నిర్వహణ ప్రక్రియ, దాని నిజాయతీ, సమగ్రతపై వారు పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, నీట్ యూజీ 2025 ఫలితాల విడుదలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇండోర్ బెంచ్ కూడా నీట్ ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. దీంతో దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఫలితాలపై ఆందోళన నెలకొంది.

## దాడి గురించి పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇవ్వడం నేరం: జైశంకర్ వీడియోతో రాహుల్ గాంధీ ట్వీట్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాద స్థావరాలపై దాడికి ముందు పాకిస్థాన్‌కు సమాచారం అందించడం నేరమని ఆయన ఆరోపించారు. ఈ చర్యకు ఎవరు అధికారం ఇచ్చారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు ఈ చర్య గురించి తెలియజేసిందని బహిరంగంగా అంగీకరించారని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల భారత వైమానిక దళం ఎన్ని విమానాలను నష్టపోయిందో అని ఆయన నిలదీశారు. "మన దాడి ప్రారంభంలోనే పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వడం ఒక నేరం. కేంద్ర ప్రభుత్వం అలా చేసిందని విదేశాంగ మంత్రి బహిరంగంగానే ఒప్పుకున్నారు. దీనికి ఎవరు అధికారం ఇచ్చారు? దీని ఫలితంగా మన వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయింది?" అని రాహుల్ గాంధీ తన పోస్టులో ప్రశ్నించారు. ఈ పోస్టుతో పాటు, జైశంకర్‌కు సంబంధించిన ఒక పాత వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. ఆ వీడియోలో జైశంకర్, "ఆపరేషన్ ప్రారంభంలోనే మేం పాకిస్థాన్‌కు ఒక సందేశం పంపాం, 'మేము ఉగ్రవాద స్థావరాలపై దాడి చేస్తున్నాం, మీ సైన్యంపై కాదు' అని చెప్పాం.

# మెట్రో రైలు ఛార్జీల పెంపు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల లేఖ

**చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ**

**పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన**

**ప్రజా రవాణాను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలని విమర్శ**

**బెంగళూరు తరహాలో ఇక్కడ కూడా ధరలు పెంచి వ్యతిరేకత మూటగట్టుకోవద్దని హితవు**

**ప్రైవేటు కంపెనీల లాభాలు కాకుండా, ప్రజా ప్రయోజనాలే చూడాలని డిమాండ్**





హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ఛార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ పరిధిలోని 11 మంది బీఆర్ఎస్ శాసనసభ్యులు నేడు ఈ లేఖను సీఎంకు పంపించారు. చార్జీల పెంపు నగరవాసులపై, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ లేఖలో, బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన మెట్రో రైలు సేవలను లక్షలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తమ ప్రధాన రవాణా మార్గంగా వినియోగిస్తున్నారని ఎమ్మెల్యేలు గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో టికెట్ ధరలను పెంచాలని చూడటం వల్ల, నిత్యం ప్రయాణించే వారిపై ఇది పెనుభారంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్రోల్, నిత్యావసరాల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలపై ఈ పెంపు మరింత భారం వేస్తుందని అన్నారు. టికెట్ ధరలను రూ.10 నుంచి రూ.20 వరకు పెంచితే, ఒక సాధారణ ప్రయాణికుడి నెలవారీ ఖర్చు కనీసం రూ.500 నుంచి రూ.600 వరకు పెరుగుతుందని, ఇది కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తుందని వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థల ప్రాథమిక ఉద్దేశం ప్రజలకు చవకైన, వేగవంతమైన, నమ్మకమైన సేవలు అందించడమేనని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ప్రజా రవాణా వ్యవస్థను దెబ్బతీసేలా ఉందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సింగపూర్, బెర్లిన్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాల్లో ప్రభుత్వాలు సబ్సిడీలు ఇచ్చి ప్రజా రవాణాను ప్రోత్సహిస్తున్నాయని గుర్తు చేశారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఉన్న హైదరాబాద్‌లో కూడా ప్రజా రవాణాను బలోపేతం చేసి, తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. ప్రైవేటు కంపెనీల లాభాల కోసం కాకుండా, ప్రజల అవసరాలకు అనుగుణంగా మెట్రో నడవాలన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. టికెట్ ధరల పెంపు వల్ల ప్రయాణికులు ఇతర రవాణా మార్గాలను ఆశ్రయించే అవకాశం ఉందని, ఇది నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న చోటల్లా మెట్రో ధరలను పెంచేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోందని, బెంగళూరులో మెట్రో చార్జీలను 100 శాతం పెంచడంతో ప్రయాణికుల సంఖ్య 13 శాతం తగ్గిందని వారు ఉదహరించారు. తీవ్ర ప్రజా వ్యతిరేకత రావడంతో అక్కడి ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ధరల పెంపును వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గి, నగర అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రజలకు అవసరమైన మార్గాల్లో నిర్దేశించిన మెట్రో రైలు ప్రాజెక్టులను రద్దు చేయడం ప్రజా రవాణా వ్యవస్థకు గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ప్రస్తుతం ఉన్న మెట్రో రైలును సమర్థంగా నడపలేని ప్రభుత్వం, మెట్రోను విస్తరిస్తామంటూ చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నందున, మెట్రో ఛార్జీల పెంపు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ప్రైవేటు కంపెనీల లాభనష్టాల ప్రాతిపదికన కాకుండా, ప్రజా కోణంలో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే రాజధాని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించరని తమ లేఖలో హెచ్చరించారు.

# జీడీపీ వృద్ధి 6.3 శాతం




**2025 సంవత్సరం అంచనాలు తగ్గించిన యూఎన్**

**పూర్వపు అంచనా 6.6 శాతం**

**వాణిజ్య ఉద్రిక్తతలు, అనిశ్చితుల ప్రస్తావన**

ఐక్యరాజ్యసమితి: భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను 2025లో 6.3 శాతానికి తగ్గిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి (యూఎన్) ప్రకటించింది. అయినప్పటికీ వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంటుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన తొలి అంచనాల్లో 2025కు భారత్ జీడీపీ 6.6 శాతం మేర వృద్ధి చెందుతుందని యూఎన్ పేర్కొనడం గమనార్హం. 2024లో భారత జీడీపీ 7.1గా ఉన్నట్టు తెలిపింది. ప్రభుత్వ మూలధన వ్యయాలు, వినియోగం బలంగా ఉండడానికితోడు సేవల ఎగుమతులు పటిష్ఠంగా ఉండడం ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తాయని ప్రస్తావించింది. ఈ మేరకు 2025 సంవత్సరానికి సంబంధించి ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి తాజా నివేదికను విడుదల చేసింది. "అధిక స్థాయి వాణిజ్య ఉద్రిక్తతలు, విధానపరమైన అనిశ్చితులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సందిగ్ధ స్థితిలో ఉంది. ఇటీవల యూఎస్ టారిఫ్‌ల పెంపుతో తయారీ వ్యయాలు భారీగా పెరగనున్నాయి. ఇది అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థకు అవరోధం కల్పించడంతోపాటు ఆర్థిక గందరగోళాన్ని పెంచుతుంది"అని యూఎన్ నివేదిక పేర్కొంది.

ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఇంధనం, కాపర్‌కు అమెరికా టారిఫ్‌లు మినహాయించడంతో వీటిపై ప్రభావం తక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అయినప్పటికీ ఈ రంగాలకు టారిఫ్‌ల మినహాయింపు తాత్కాలికమేనన్న విషయాన్ని గుర్తు చేసింది.

**2026లో 6.4 శాతం..**

భారత జీడీపీ 2026లో 6.4 శాతం మేర వృద్ధిని సాధించొచ్చని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. "భారత్‌లో బలమైన ఆర్థిక




కార్యకలాపాల నేపథ్యంలో నిరుద్యోగం నియంత్రణలోనే ఉంది. అయినప్పటికీ పని ప్రదేశాల్లో లింగ అసమానతలు కొనసాగుతున్నాయి. ఇది స్త్రీ, పురుషుల పరంగా మరింత సమాన అవకాశాల కల్పన అవసరాన్ని సూచిస్తోంది"అని యూఎన్ నివేదిక తెలిపింది. ఇక ద్రవ్యోల్బణం ఈ ఏడాది 4.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. గతేడాది 4.9 శాతం కంటే తక్కువని పేర్కొంది. 2025లో ప్రపంచ జీడీపీ 2.4 శాతం వృద్ధి చెందొచ్చని ఐక్యరాజ్యసమితి నివేదిక అంచనా వేసింది. 2024లో నమోదైన 2.9 శాతం కంటే తక్కువ. ఈ ఏడాది ఆరంభంలో యూఎన్ వేసిన అంచనాతో పోల్చి చూస్తే 0.4 శాతం తగ్గింది. 2026లో ప్రపంచ జీడీపీ వృద్ధి రేటు 2.5 శాతంగా ఉండొచ్చని పేర్కొంది.

అంతర్జాతీయంగా మారిపోయిన పరిణామాల నేపథ్యంలో జనవరిలో వేసిన అంచనా కంటే 0.4 శాతం తగ్గించాల్సి వచ్చినట్టు వివరించింది. ఇది మాంద్యం కాకపోయినప్పటికీ వృద్ధి రేటు తగ్గడం ఎన్నో దేశాలు, ప్రాంతాలపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. వాణిజ్యం, ఆర్థిక విధానాల్లో అనిశ్చితులు, అస్థిరతలు, భౌగోళిక ఉద్రిక్తతలతో కీలక పెట్టుబడుల నిర్ణయాలు వెనక్కి వెళ్లిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. అధిక రుణ భారం, నిదానించిన ఉత్పత్తి వంటి ఇప్పటికే ఉన్న సవాళ్లను ఇవి మరింత పెంచుతాయని.. ప్రపంచ వృద్ధి అవకాశాలను దెబ్బతీయొచ్చని పేర్కొంది. అమెరికా జీడీపీ వృద్ధి 2024లో 2.8 శాతంగా ఉంటే, 2025కు 1.6 శాతంగా యూఎన్ నివేదిక అంచనా వేసింది. చైనా జీడీపీ 4.6 శాతానికి తగ్గొచ్చని తెలిపింది.

# భవిష్యత్‌లో మూల్యం చెల్లించకోకతప్పదు

- హామీలు అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్
- కక్షసాధింపులో భాగంగానే ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్
- తప్పుడు కేసుల్లో జగన్‌ను ఇరికిస్తేనే తమ పార్టీలకు భవిష్యత్ ఉంటుందనేది కూటమి పార్టీ నేతల భావన
- అసలైన లిక్కర్ స్కాం ఈ ప్రభుత్వంలోనే జరుగుతోంది
- అనుమతి ఉన్న దుకాణాల కంటే మూడింతలు అధికంగా బెల్ట్ షాపులు
- ఎమ్మార్పీ ధర కంటే రూ.30 వరకు అదనపు వసూళ్లు
- పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- కూటమి ప్రభుత్వ అక్రమ కేసులకు భయపడేది లేదు
- భవిష్యత్‌లో కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారు


కక్షరాజకీయాలకు స్వస్తి చెప్పి హామీల అమలుపై దృష్టి పెట్టండి

వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత స్పష్టీకరణ




అనంతపురం జనం ప్రతినిధి మే 17 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న కక్షసాధింపు రాజకీయాలకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కొందరు అధికారులకు పోస్టింగ్స్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల వాళ్లు కూడా విస్తుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో స్కిల్ స్కాంలో చంద్రబాబును సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేశారని, ఈ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా జగన్‌పై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. సర్వీస్‌లో ఉన్న వారినే కాకుండా రిటైర్డ్ అయిన అధికారులను కూడా అరెస్ట్ చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ కార్యదర్శిగా పని చేసిన ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ఓఎస్డీగా పని చేసిన కృష్ణమోహన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు ఏ డిస్టలరీ ద్వారా మద్యం సరఫరా జరిగిందో అవే డిస్టలరీల నుంచే వైఎస్ జగన్ హయాంలోనూ జరిగాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా అవే డిస్టిలరీలు మద్యం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకపోయినా..తప్పుడు కేసులు పెడుతూ, అందులో అందరి పేర్లు చేరుస్తూ, తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యల కారణంగా భవిష్యత్‌లో రాష్ట్రంలో ఏ అధికారీ పనిచేయలేని పరిస్థితిని తీసుకొస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పనిచేయలేక కొందరు అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. చివరకు హైకోర్టు జడ్జిలు అక్షింతలు వేసినా ఏమాత్రం సిగ్గు లేకుండా ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గించాలన్న లక్ష్యంతో కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేట్ మాఫియాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వం ద్వారానే మద్యం అమ్మకాలు చేశామని, బెల్ట్‌షాపులను నిర్మూలించామన్నారు. అసలైన మద్యం స్కాం అనేది ఈ కూటమి ప్రభుత్వంలోనే జరుగుతోందన్నారు. అనుమతి ఇచ్చిన దుకాణాల కంటే మూడింతలు అధికంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోనే పరిస్థితి దారుణంగా ఉందని ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికల్లోనే కథనాలు వస్తున్నాయని తెలిపారు. ఏ షాప్‌లో చూసినా అధిక రేట్లకు మద్యం అమ్ముతున్నారన్నారు. అనంతపురంలో ఏ షాప్‌లో చూసినా ఎమ్మార్పీ ధర కంటే రూ.30 వరకు ౹అధికంగా అమ్ముతున్నారని, పర్మిట్ రూంలు కూడా విచ్చలవిడిగా ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడ చూసినా ఇసుక, మద్యం, మట్టి, కంకర దోపిడీ జరుగుతోందన్నారు. మరోవైపు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితిలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. తప్పుడు కేసుల్లో జగన్‌ను ఇరికిస్తేనే తమ పార్టీలకు మనుగడ ఉంటుందని కూటమి పార్టీలు భావిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యంపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు నమ్మకం లేదని.. భవిష్యత్‌లో ఆ పార్టీలకు ప్రజలు ఓట్లు వేయరని అప్పుడే గ్రహించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎంతో మంది నియంతలు కాలగర్భంలో కలిశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌ను నైతికంగా దెబ్బతీయాలని చూస్తున్నారని తెలిపారు. అక్రమ కేసులు, అరెస్టులు చేసినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నుంచి నాయకుల వరకు ఎవరూ భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కూటమి పార్టీలకు భవిష్యత్‌లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఈ ఆకు రోజూ పిడికెడు తింటే చాలు.. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..! తెలిస్తే..



మన చుట్టూ ఉండే పరిసరాల్లో ఎన్నో ఔషధ గుణాలతో కూడిన మొక్కలు, చెట్లు అనేకం ఉన్నాయి. అయితే వాటి ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అలాంటి ఔషధ గుణాలు కలిగిన మొక్కలలో మునగ చెట్టు ఒకటి. మునగ కాయలతో పాటు మునగ ఆకులు కూడా ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉన్న యాంటీ



ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ 300 రకాల రోగాలను నయం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. మునగాకులో ఫైబర్, ప్రొటిన్లు సమృద్ధిగా లభిస్తాయి. మునగాకులలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె జబ్బులను నిరోధించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. మునగాకులలో ఫైబర్, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండటంతో జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. అయితే వీటిని పొడిలా తయారు చేసి, పచ్చడి, పప్పు లేదా సాంబార్, రసం వంటివి చేసుకుని తినవచ్చు. మునగాకులను తినడం వల్ల రక్తంలో షుగర్ స్థాయిలు తగ్గిపోతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇవి ఒక వరం లాంటి ఆహారంగా మారతాయి. రోజువారీ ఆహారంలో మునగాకులు ఎంతో మేలు చేస్తాయి. మునగాకులను తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. మునగాకులలో ఉండే సమ్మేళనాలు శరీరంలో వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్‌తో బాధపడేవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. 100 గ్రాముల మునగాకుల్లో విటమిన్ సి - 18 మిల్లీగ్రాములు, విటమిన్ ఎ - 9100, క్యాల్షియం - 130 మిల్లీగ్రాములు, ప్రోటీన్ 4 గ్రాములు ఉంటాయి. మునగాకులలో విటమిన్ సి, విటమిన్ ఎ కొల్లాజెన్ ఉత్పత్తి చేయడానికి సాయపడతాయి. ఈ కారణంగా చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది. ముఖంపై ముడతలు తగ్గి యవ్వనంగా ఉండేలా చేస్తుంది. ఇవి శరీర శక్తి స్థాయిలను పెంచి, అలసట, నీరసం నుంచి ఉపశమనం ఇస్తాయి. ఉదయం మునగాకులు తింటే రోజంతా చురుకుగా ఉండేలా చేస్తాయి.

# రక్తంలో ప్లేట్ లెట్లను పెంచే సహజమైన ఫుడ్ ఇదే!

**డెంగ్యూ వంటి విష జ్వరాలు, పోషకాహార లేమితో రక్తంలో తగ్గిపోయే ప్లేట్ లెట్లు**

**గాయాలు మానడానికి, రక్తం గడ్డకట్టడానికి ప్లేట్ లెట్లు తప్పనిసరి**

**వాటి సంఖ్యను సహజంగానే పెంచేందుకు కొన్ని రకాల ఆహారం తోడ్పడుతుందని చెబుతున్న నిపుణులు**

ఇటీవలి కాలంలో డెంగ్యూ వంటి విష జ్వరాలు పంజా విసురుతున్నాయి. దానితో రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య తగ్గిపోయి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. పోషకాహార లేమి కూడా ఈ సమస్యను మరింతగా పెంచుతోంది. శరీరంలో గాయాలు మానడానికి, రక్తం గడ్డకట్టడానికి ప్లేట్ లెట్లు తప్పనిసరి. తగిన సంఖ్యలో ప్లేట్ లెట్లు లేకుంటే... ప్రాణాలకే ప్రమాదం కూడా.



అలాంటి ప్లేట్ లెట్ల సంఖ్యను సహజంగానే పెంచేందుకు కొన్ని రకాల ఆహారం తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో వాటిని చేర్చుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.


బొప్పాయి పళ్లు, ఆకులు...

గతంలో డెంగ్యూ వ్యాధి తీవ్ర స్థాయిలో పంజా విసిరినప్పుడు... బొప్పాయి ఆకులు, బొప్పాయి పళ్లతో ఉన్న ప్రయోజనంపై వార్తలు వెలువడ్డాయి. చాలా మందిలో ఇవి మంచి ఫలితాన్ని కూడా ఇచ్చాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బొప్పాయిలో



అధికంగా ఉండే విటమిన్ సి, కొన్ని రకాల ఎంజైమ్ లు రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి తోడ్పడతాయని వివరిస్తున్నారు.

దానిమ్మ పళ్లు...



ఒక రకంగా చెప్పాలంటే దానిమ్మ పండు వరప్రదాయిని అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో అధిక స్థాయిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలో వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ)ని బలోపేతం చేస్తాయని వివరిస్తున్నారు. ముఖ్యంగా రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు.

ఆకుకూరలు, ఆకుపచ్చని కూరగాయలు...

పాలకూర, కేల్, బ్రాకొలి వంటి ఆకుకూరలు, కూరగాయల్లో విటమిన్ కె ఎక్కువగా ఉంటుందని... మన శరీరంలో రక్తం గడ్డకట్టేందుకు ఇది కీలకమైనదని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఏదో ఒక రకంగా తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

గోధుమ గడ్డి...

గోధుమ గడ్డి జ్యూస్ ను తరచూ తీసుకుంటుంటే... శరీరంలో హీమోగ్లోబిన్ వృద్ధి చెందుతుందని, ప్లేట్ లెట్ల సంఖ్య పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

నువ్వుల నూనె...

మన శరీరానికి అత్యంత అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు, పోషకాలు నువ్వులలో ఉంటాయని... అవి రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. నువ్వుల నూనెతో వంట చేసుకున్నా... రోజూ ఒక స్పూన్ నేరుగా తీసుకున్నా మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

గుమ్మడి పండు...



గుమ్మడి పండ్లలో అధికంగా ఉండే విటమిన్ ఏ, కొన్ని ఎంజైములు మన శరీరంలో ప్లేట్ లెట్ల ఉత్పత్తికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇమ్యూనిటీని పెంచుతాయని... డెంగ్యూ వంటి వ్యాధులను ఎదుర్కోవడంలో తోడ్పడతాయని వివరిస్తున్నారు.

బీట్ రూట్...

దీనిలో ఐరన్, ఫోలేట్ అధికంగా ఉంటాయని... ఇవి ఎర్ర రక్తకణాలు, ప్లేట్ లెట్ల ఉత్పత్తికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. జ్యూస్ గా గానీ, సలాడ్ల రూపంలో గానీ బీట్ రూట్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

క్యారెట్లు...

వీటిలో అధికంగా ఉండే విటమిన్ ఏ, బీటా కెరోటిన్ వంటివి ప్లేట్ లెట్ల ఉత్పత్తికి, ఇమ్యూనిటీ పెరుగుదలకు తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని కూరల్లో భాగంగా, పచ్చిగా, జ్యూస్ గా... ఇలా ఎలా తీసుకున్నా ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

సిట్రస్ పళ్లు...

నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతి పళ్లలో విటమిన్ సి ఎక్కువని... ఇది ఇమ్యూనిటీకి, ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి దోహదం చేస్తుందని నిపుణులు వివరిస్తున్నారు.

# లివర్ ను సహజంగా క్లీన్ చేసే ఆహారం ఇదే!

**మారిన జీవన శైలితో కాలేయంపై పెరుగుతున్న ఒత్తిడి**

**దాని పనితీరు దెబ్బతింటే ఎన్నో ఆరోగ్య సమస్యలు**

**కొన్ని రకాల ఆహారంతో లివర్ పునరుత్తేజం చెందుతుందంటున్న ఆరోగ్య నిపుణులు**



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో కాలేయం (లివర్) ఒకటి. రక్తంలోని విష పదార్థాలు, వ్యర్థాలను తొలగించడంతోపాటు... మనం తినే ఆహారం సరిగా జీర్ణం కావడానికి కాలేయమే కీలకం. కానీ మన ఆహార అలవాట్లలో మార్పులు, ఆల్కహాల్ వినియోగం, జీవన శైలిలో మార్పుల వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతోంది. ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు వస్తున్నాయి. అయితే కాలేయానికి తనంతట తాను మరమ్మతు చేసుకునే శక్తి ఉంటుందని... ఇందుకోసం కొన్ని రకాల ఆహార పదార్థాలు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారాన్ని మన రోజువారీ డైట్ లో చేర్చుకుంటే మంచి ఫలితం ఉంటుందని వివరిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు చెబుతున్న ఆ ఆహార పదార్థాలు ఏవంటే...


వెల్లుల్లి...

దీనిలో సల్ఫర్ ఆధారిత రసాయన సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. శరీరంలోని విష పదార్థాలను బయటికి పంపేందుకు కాలేయం ఉత్పత్తి చేసే ఎంజైముల తయారీలో ఆ రసాయన సమ్మేళనాలు తోడ్పడుతాయి. ఇక వెల్లుల్లిలోని అల్లిసిన్, సెలీనియం రెండూ కూడా కాలేయాన్ని రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

బీట్ రూట్...

వీటిలోని బెటాలైన్స్ గా పిలిచే రసాయన సమ్మేళనాలు కాలేయం ఇన్ ఫ్లమేషన్ ను తగ్గిస్తాయని... విష పదార్థాలను బయటికి పంపడంలో తోడుగా నిలుస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తరచూ బీట్ రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడుతుందని వివరిస్తున్నారు.

గ్రీన్ టీ...



గ్రీన్ టీలో కెటచిన్స్ గా పిలిచే రసాయన సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. అవి కాలేయం పనితీరును మెరుగుపర్చి, వ్యాధులు రాకుండా చూస్తాయి. తరచూ గ్రీన్ టీ తీసుకుంటే... లివర్ ఎంజైమ్ ను నియంత్రించి ఆరోగ్యాన్ని ఇస్తుంది.

ఆకుకూరలు, కూరగాయలు...

ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలు, కూరగాయల్లో అధికంగా ఉండే క్లోరోఫిల్... లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలోని భార ఖనిజాలు, రసాయనాలు, పురుగు మందుల అవశేషాలను తొలగించడంలో లివర్ కు సాయపడుతుంది.

ఆలివ్ ఆయిల్...

ఆలివ్ ఆయిల్ లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు... శరీరంలో కొన్నిరకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ముఖ్యంగా ఎక్స్ ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ ఉపయోగించడం వల్ల లాభం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

వాల్ నట్స్..

వీటిలో అర్జినైన్ అనే అమైనో ఆమ్లం అధికంగా ఉంటుంది. అది శరీరంలో ఉత్పన్నమయ్యే అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సాయపడుతుంది. ఇక వాల్ నట్స్ లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, గ్లుటాథియాన్ వంటివి కాలేయం పనితీరును మెరుగుపర్చి వ్యాధులు రాకుండా చూస్తాయి. ఇక పసుపులోని కర్క్యుమిన్ అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తూ.. కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లలో అధికంగా ఉండే 'విటమిన్ సీ' తోనూ శరీరంలో విష పదార్థాలు తొలగిపోయి... కాలేయం ఆరోగ్యానికి తోడ్పడుతుంది. యాపిల్స్ లో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ శరీరంలో విష పదార్థాలను తొలగించి, కాలేయానికి తోడ్పడుతుంది.

## రోజూ పొద్దున్నే నెయ్యిని ఇలా తీసుకుంటే ఊహించని లాభాలు.. వెంటనే అలవాటు చేసుకోండి..



నెయ్యిలోని ఔషధ గుణాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. మన ఆరోగ్యానికి అవసరమైన విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ కె వంటి ప్రోటీన్స్, కొవ్వుని కరిగించే విటమిన్స్ పుష్కలంగా ఉన్నాయి. నెయ్యి వల్ల శరీరానికి ఎన్నో లాభాలు ఉన్నాయి. అయితే, నెయ్యి కలిపిన నీళ్లను రోజూ ఉదయం తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడటమే కాకుండా కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు దూరం అవుతాయి. మరిన్ని లాభాలు ఇక్కడ తెలుసుకుందాం.. ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతోపాటు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్



తొలగిపోతాయి. ఎముకలు ధృడంగా తయారవుతాయి. నెయ్యిలో బ్యూటిరిక్ ఆమ్లము ఉంటుంది. దీని కారణంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే రోజు ఉదయం నెయ్యి కలిపిన నీళ్లను తీసుకోవడం మంచిది. మెరిసే చర్మం కావాలని ప్రతీ ఒక్కరికి ఉంటుంది. చర్మం పొడిబారకుండా ఎల్లప్పుడూ తేమగా ఉండాలంటే నెయ్యి కలిపిన నీళ్లను తీసుకోవాలి. దీనివల్ల శరీరంలోని చెడు పదార్థాలు బయటకు పోయి చర్మానికి కావలసిన మెరుపు వస్తుంది. నెయ్యిని తీసుకుంటే ఎముకల బలం పెరుగుతుంది. దృష్టి సమస్యలు దూరమవుతాయి. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. జీవక్రియ ప్రక్రియ పెరుగుతుంది. నెయ్యిలో బ్యూట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది శరీరంలో మంటను తగ్గిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థని ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రేగు వాపుని తగ్గిస్తుంది. ఎముకల కీళ్ళకు బలాన్ని అందించడంలో నెయ్యి బాగా సాయపడుతుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలుపుకుని తాగడం వల్ల ఎముకలు ధృఢంగా ఉండి అనవసర నొప్పులు తగ్గిపోతాయి.

## వెయిట్ లాస్ చేసే హెల్దీ బ్రేక్ ఫాస్ట్.. టేస్ట్ అదుర్స్ అంతే!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఇబ్బంది పడే సమస్యల్లో అధిక బరువు, ఊబకాయం కూడా ఒకటి. వీటి కారణంగా ఇతర అనారోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బరువును తగ్గించుకునేందుకు డైట్ కూడా మెయిన్ టైన్ చేస్తూ ఉండాలి. రోజూ తినే వాటిని తినీ తినీ బోర్ కొడుతుంది. టేస్టీగా, వెరైటీగా తినాలని మనసు చెబుతూ ఉంటుంది. అలాంటి వారు ఈ హెల్దీ బ్రేక్ ఫాస్ట్ ఖచ్చితంగా ట్రై చేయవచ్చు. ఇది రుచిగా ఉండటమే కాకుండా.. కొద్దిగా తిన్నా కడుపును నిండుగా ఉంచుతుంది. కాబట్టి ఎక్కువగా కూడా తీసుకోలేరు. ఆరోగ్యానికి మంచి చేసే పదార్థాలే ఎక్కువ. అది కూడా చియా సీడ్స్‌తో.. ఇవి హెల్త్‌కి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది చాలా సింపుల్‌గా కూడా అయిపోతుంది. పెద్దగా హైరానా పడాల్సిన పని లేదు. మరి చియా సీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్ ఎలా తయారు చేస్తారు? ఇందుకు కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

చియాసీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్: చియా సీడ్స్, బాదం పాలు లేదా పాటు, కొద్దిగా వెన్నిలా క్రీమ్, తేనె, బనానా లేదా స్ట్రాబెర్రీలు, యాపిల్, దానిమ్మ ఇలా ఏదైనా తీసుకోవచ్చు.

చియాసీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్: ముందుగా చియా సీడ్స్‌ని ఓ పది నిమిషాల పాటు నీటిలో నానబెట్టాలి. ఇప్పుడు వీటిని ఒక గాజు గ్లాస్ లేదా గాజు గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో బాదం మిల్క్ లేదంటే సాధారణ కాచిన పాలను అయినా తీసనుకోవచ్చు. ఆ తర్వాత ఫ్లేవర్ కోసం వెన్నిలా క్రీమ్ యాడ్ చేస్తారు. ఇందులో మీకు నచ్చిన ఫ్లేవర్ యాడ్ చేసుకోవచ్చు. అలాగే తేనె కూడా ఒక స్పూన్ కలపాలి. ఇది కూడా ఆప్షనల్. కావాలంటే వేసుకోవచ్చు. ఇప్పుడు ఇవన్నీ బాగా మిక్స్ చేసుకోవాలి. ఉదయాన్నే చేసుకుంటే ఓ అరగంట పాటు ఫ్రిజ్‌లో ఉంచండి. రాత్రి పూట రెడీ చేసుకుంటే.. ఉదయాన్నే తినేయవచ్చు. ఇక మీరు తినే ముందు బనానా లేదా స్ట్రాబెర్రీలు, యాపిల్, దానిమ్మ ఇలా ఏదైనా మీకు నచ్చి పండ్ల ముక్కలను కట్ చేసి వేసుకోవచ్చు. మీకు కావాలంటే నానబెట్టిన డ్రై నట్స్ పై నుంచి వేసి గార్నిష్ చేసుకోవచ్చు. అంతే ఎంతో రుచిగా ఉండే హెల్దీ బ్రేక్ ఫాస్ట్ సిద్ధం. దీన్ని మీరు డిన్నర్ లేదా స్నాక్‌లా కూడా తీసుకోవచ్చు. మంచి పోషకాలు అన్నీ శరీరానికి అందుతాయి.

# రోజూ పొద్దునే కాసిన్ని తులసి ఆకులు తింటే ఏమవుతుందో తెలుసా?

**మనం ఎంతో పవిత్రంగా భావించే మొక్క తులసి**

**అందులో ఎన్నో రకాల ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతున్న నిపుణులు**

**నేరుగా నమిలిగానీ, టీ రూపంలోగానీ తీసుకుంటే మేలని సూచనలు**

భారత సమాజంలో తులసి మొక్కలకు ఎంతో ప్రాధాన్యముంది. మనం ఎంతో పవిత్రంగా భావించి, ఇళ్ల ముందు పెంచే తులసి మొక్కల్లో ఎన్నో అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తులసిలో ఉండే పదార్థాలు మనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడంతోపాటు వ్యాధులను దూరం పెడతాయని స్పష్టం చేస్తున్నారు. తులసి ఆకులను నేరుగా నమిలి తినడంగానీ, ఎండబెట్టి పొడి చేసి టీ రూపంలో తీసుకోవడంగానీ చేయవచ్చని చెబుతున్నారు. రోజూ పొద్దున్నే కొన్ని తులసి ఆకులు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు.

### రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది

రోజూ పొద్దున్నే కొన్ని తులసి ఆకులను తీసుకోవడం వల్ల అందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఎసెన్షియల్ ఆయిల్స్ శరీరానికి అందుతాయి. అవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. బ్యాక్టీరియా, వైరస్ లతో పోరాడే శక్తిని ఇస్తాయి.

### కాలేయాన్ని శుభ్రపరుస్తుంది

తులసిలో ఉండే కొన్ని రసాయన పదార్థాలు శరీరం నుంచి విష పదార్థాలు, వ్యర్థాలు బయటికి వెళ్లిపోయేందుకు తోడ్పడుతాయి. ముఖ్యంగా కాలేయాన్ని శుభ్రం చేస్తాయి. రోజూ పరగడుపున తులసి



ఆకులు తీసుకుంటే.. కాలేయం పనితీరు అద్భుతంగా మెరుగుపడుతుంది.

### ఒత్తిడి, యాంగ్జైటీని తగ్గిస్తుంది..

తులసిలోని 'అడాప్టోజెనిక్ కాంపౌండ్స్'గా పిలిచే రసాయన సమ్మేళనాలు ఉంటాయి. అవి శరీరంలో ఒత్తిడిని తగ్గించి, యాంగ్జైటీని దూరం చేస్తాయి. పొద్దున్నే తులసిని తీసుకోవడం వల్ల మనలో మానసిక ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ప్రశాంతంగా ఉన్న భావన వస్తుంది.


### జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు

తులసి మన శరీరంలో జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైముల విడుదలను ప్రేరేపిస్తుంది. దీనిద్వారా ఆహారం బాగా జీర్ణమై, పోషకాలు శరీరానికి అందుతాయి. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గుతాయి.

### శ్వాస వ్యవస్థను మెరుగుపరుస్తుంది

తులసిలోని యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలు శ్వాస వ్యవస్థలో సమస్యలను దూరం చేస్తుంది. దగ్గు, ఆస్తమా, సైనస్, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### రక్తంలో షుగర్ లెవల్స్ నియంత్రిస్తుంది



రోజూ ఉదయమే తులసి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సూలిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీనితో రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. మధుమేహం ఉన్నవారికి దీనివల్ల మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి ఎంతో మంచిది

శరీరంలో కొలెస్ట్రాల్, షుగర్ స్థాయులను నియంత్రించడం, రక్తపోటు తగ్గేందుకు తోడ్పడటం ద్వారా తులసి మన గుండె ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతుంది.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక www.saisuryaa.com

## సంపాదకీయం

### వెనక్కి తగ్గిన అమెరికా - చైనా

### (విశ్లేషణ)

వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది.ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది.ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హె లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది.గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా-చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి.అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి.చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి.వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి.ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది.ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి.ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు.అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, మున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం.నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు.సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. మున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

# దేశ భద్రత లక్ష్యంగా ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం.. ఎప్పుడంటే.







భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో భారతదేశ భద్రతే లక్ష్యంగా మరో అడుగు ముందుకు వేసి ఈనెల 18న ఉదయం 5.59 ని,, లకు శ్రీహరి కోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి పీఎస్ఎల్వీ సి 61 రాకెట్ ప్రయోగం ద్వారా EOS-09 అనే సాటిలైట్ విజయవంతం గా కక్షలోకి పంపనుంది. భారత దేశ రక్షణ రంగానికి దోహదపడే ఈ భూ పరిశీలన ఉపగ్రహం ఉపగ్రహాన్ని నింగికి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోటలో అన్ని సన్నాహాలు సిద్ధం చేసింది. రాకెట్ అసెంబ్లింగ్ భవనం వద్ద రాకెట్ అనుసంధాన పనులు పూర్తి చేసి PSLV.. C61 రాకెట్ ను ప్రయోగ వేదిక వద్దకు విజయవంతం గా తరలించి రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఇస్రోకు ఎంతో పేరు ప్రతిష్ఠలు తీసుకు వస్తున్న పిఎస్ఎల్వి లాంచ్ వెహికల్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన పీఎస్ఎల్వీ సి 61 రాకెట్ ప్రయోగం ద్వారా ఈవో ఎస్ జీరో నైన్ (EOS..09) RISAT-1B ఉపగ్రహాన్ని నింగికి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని పనులు పూర్తి చేశారు. పిఎస్ఎల్వి సి 61 రాకెట్ ను నాలుగు దశలుగా శాస్త్రవేత్తలు నిర్మించారు. ఈ ప్రయోగం ద్వారా భారత దేశానికి చెందిన EOS-09 (RISAT-1B) CGU SAT, LEAP-1 అనబడే మూడు ఉపగ్రహాలను, అంతేకాకుండా US కు చెందిన PHOENIX SAT అదేవిధంగా POLAND దేశానికి చెందిన SOWA-1 ఉపగ్రహాలను 529 కిలోమీటర్ల ఎత్తున ఉన్న SUN SYNCHRONOS ORBIT సూర్యానువర్తన కక్ష లోకి ఈ ఉపగ్రహాలను విజయవంతం గా పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ ఏర్పాట్లు పనులు పూర్తి చేసి ఇస్రో 101 వ రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు..అయితే గత ఏడాది చివరలో పిఎస్ఎల్వి సి 60 రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఇన్నాళ్లకు ఇస్రో మరో pslv61 రాకెట్ ను షార్ లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుండి ఈ నెల 18న ఉదయం 5.59 నిమిషాలు కు ఈ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించేందుకు ఇస్రో సర్వం సిద్ధమైంది. అయితే ఇస్రో 100 వ రాకెట్ ప్రయోగం ద్వారా జిఎస్ఎల్వి ఎఫ్ 15 ప్రయోగించి ఘనవిజయాన్ని సాధించి ఉంది.

ఇది ఇలా ఉంటే 101 వ రాకెట్ ప్రయోగం ద్వారా పిఎస్ఎల్వీ సి 61 రాకెట్ ప్రయోగాన్ని ప్రయోగించి దేశ సరిహద్దుల్లో ఇటీవల నెలకొన్న కొన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇస్రో ఈ నిఘా ఉపగ్రహమును అవసరాన్ని గుర్తించి చకచకా పనులు పూర్తిచేసి ఈ నెల 18వ తేదీన ఉదయం 5.59 ని,,లకు తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుండి ఈ pslv61 రాకెట్ ప్రయోగాన్ని జరిపేందుకు ఇప్పటికే ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ పనులను పూర్తి చేశారు .ఇస్రో ప్రస్తుతం 1710 కేజీలు బరువు కలిగిన ఈ ఓ ఎస్ 09 ఉపగ్రహంను ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశిత కక్ష్యలోకి పంపనుంది. EOS.09 పేరుతో ప్రయోగిస్తున్న RISAT..1B భూ పరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా దేశ సరిహద్దు ప్రాంతాలను అందులో ఉగ్రవాద కదలికలను రాత్రి పగలు తేడా లేకుండా పసికట్టే సామర్థ్యం కలిగి ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో ఇస్రో దేశ రక్షణ కోసం కనీసం 52 నిఘా ఉపగ్రహాలను భూకక్షలోకి ప్రవేశపెట్టి భారతీయ రక్షణ రంగానికి విలువైన సేవలు అందించేందుకు ఇస్రో సైంటిస్టులు అహర్నిశలు శ్రమిస్తున్నారు.. శత్రువుల పనితీరును పసిగట్టేందుకు, సరిహద్దులను పర్యవేక్షించేందుకు ,సైనిక కార్యకలాపాల సమయంలో త్రివిధ దళాలకు సాయపడేందుకు ఈ EOS-09 SAT ఉపయోగపడుతుందని ఇస్రో వర్గాలనుంచి సమాచారం. అందుకే ప్రస్తుతం ఈ EOS-09 ఉపగ్రహ ప్రయోగంపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఏది ఏమైనా ఈవో ఎస్ జీరో నైన్ ఉపగ్రహం ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా భూ ఉపరితలాన్ని అత్యంత స్పష్టతతో కూడిన హై రిజల్యూషన్ ఫోటోలను తీసి ఇస్రోకు పంపే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది .ఇందులో అమర్చిన సి బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ ప్రధాన ప్రత్యేకత కాగా ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడా లేకుండా సునిసిత విశ్లేషణ చేసే సామర్థ్యం ఉపగ్రహంలోని ఉపకరణాలకు కలిగి ఉంటుంది .కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటు స్థాయి సంఘ సభ్యులు ఈ ఉపగ్రహాన్ని వీక్షించేందుకు శ్రీహరికోటకు వస్తున్నందున శ్రీహరికోటలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు .ఏది ఏమైనా ఈ PSLV-C61 రాకెట్ ప్రయోగం విజయవంతం అయితే దేశ రక్షణ రంగానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

# ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై విజయమే కాదు.. డబ్బు రూపంలో ఇండియాకు వేల కోట్ల లాభం! ఎలాగంటే..?




జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ దాడికి ప్రతీకారంగా ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతూ భారత్ మే 6,7 తేదీల మధ్య రాత్రి పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో మొత్తం 9 స్థావరాలపై వైమానికి దాడులు చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ దాడులతో పాకిస్థానే కాదు భారత శక్తిని చూసి యావత్ ప్రపంచమే ఉలిక్కిపడింది. సహనంతో ఉండే దేశాన్ని గెలికితే ఎలా ఉంటుందో చూపించింది. అయితే ఉగ్రవాదులపై చేసిన ఈ దాడులకు భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ అని పేరు పెట్టింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ఉగ్రవాదులకు వంతపాడుతూ భారత్‌పై సైనిక దాడులకు ప్రయత్నించినా.. వాటిని భారత సైన్యం తిప్పికొట్టింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆ విషయం పక్కనపెడితే.. ఆపరేషన్ సిందూర్‌తో ఏం సాధించాం అని ఆలోచిస్తే.. ప్రపంచ మానవాళికి ముప్పుగా మారుతున్న 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టిలో కలిపేశాం అని గర్వంగా చెప్పుకోవచ్చు. ఉగ్రవాదంపై భారత్ సాధించిన విజయంగా అభివర్ణించవచ్చు. అదే ఆపరేషన్ సిందూర్ ప్రధాన లక్ష్యం కూడా. అయితే.. కేవలం ఉగ్రవాదులపై విజయమే కాదు.. మంచి చేస్తే మరింత మంచి జరుగుతుంది అన్నట్లు ఇండియాకు వేల కోట్ల లాభం కూడా వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం.. ఆపరేషన్ సిందూర్‌తో మన ఎయిర్ ఫోర్స్ సాధారణ పౌరులకు ఏమాత్రం నష్టం కలగకుండా కేవలం ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని.. గురి తప్పకుండా క్షిపణులు ప్రయోగించింది. అంటే టార్గెట్ మిస్ కాకుండా కచ్చితత్వంతో దాడులు చేసింది. అలాగే పాకిస్థాన్ ఎదురుదాడికి తిగితే.. వారి డ్రోన్లు, క్షిపణులను మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో తిప్పి కొట్టాం. భారత భూభాగంలో కూలిన డ్రోన్లు, క్షిపణుల ముక్కలను పరిశీలిస్తే.. %ూా%-15 క్షిపణుల ముక్కలు (చైనీస్ మూలం) "యిహా" లేదా "యెహా" అని పిలువబడే టర్కిష్-మూలం %ఖూా౦%లు, దీర్ఘ-శ్రేణి రాకెట్లు, క్వాడ్‌కాప్టర్లు, వాణిజ్య డ్రోన్ స్వాధీనం చేసుకుని గుర్తించారు. అవి టర్కీ, చైనా తయారు చేసినవిగా తేలింది. అంటే.. ఆ దేశాల రక్షణా వస్తువులను, ఆయుధాలను భారత్ నాశనం చేసి.. వాటి కంటే శక్తివంతమైన ఆయుధ సామాగ్రి, డిఫెన్స్ వ్యవస్థ మన వద్ద ఉందని ఈ ప్రపంచానికి చాటి చెప్పింది. అయితే వాటిలో కొన్ని మనం ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నవి ఉన్నా.. మన స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న ఆకాశ్ వంటి డిఫెన్స్ వ్యవస్థ, తేజస్ వంటి యుద్ధ విమానాలు కూడా ఉన్నాయి. భారత్ సొంతంగా తయారు చేసుకున్న యుద్ధ సామాగ్రి బలమేంటో తెలిసిన ప్రపంచ దేశాలు మన నుంచి వీటిని కొనుగోలు చేసే అవకాశం పెరిగింది. గతేడాది రూ.23 వేల కోట్ల విలువైన డిఫెన్స్ ఎగుమతులు చేసిన భారత్, ఆపరేషన్ సిందూర్ కారణంగా అవి రూ.50 వేల కోట్లుకు పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు దాదాపు రూ.24,000 కోట్ల రికార్డును దాటాయి. 2029 నాటికి ఈ సంఖ్యను రూ.50,000 కోట్లకు పెంచడం, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా, ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ ఎగుమతిదారుగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది.

మేక్ ఇన్ ఇండియా..

మేక్ ఇన్ ఇండియా చొరవ, ఆత్మనిర్భర్ భారత్ బలమైన ప్రోత్సాహం ద్వారా ఇండియా ఒక ప్రధాన రక్షణ తయారీ కేంద్రంగా అవతరించింది. 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో స్వదేశీ రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయిలో రూ.1.27 లక్షల కోట్లకు చేరుకుంది. అయితే 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.23,622 కోట్లకు పెరిగాయి. ఇది 2013%-%14 నుండి 34 రెట్లు ఎక్కువ. వ్యూహాత్మక సంస్కరణలు, ప్రైవేట్ రంగ ప్రమేయం, బలమైన పరిశోధన, అభివృద్ధి అధునాతన సైనిక వేదికల అభివృద్ధికి దారితీశాయి.

ధనుష్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ :

అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ , ప్రధాన యుద్ధ ట్యాంక్ అర్జున్, లైట్ స్పెషలిస్ట్ వాహనాలు, హై మొబిలిటీ వాహనాలు, తేలికపాటి పోరాట విమానం తేజస్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ , లైట్ యుటిలిటీ హెలికాప్టర్ , ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, ఆయుధ గుర్తింపు రాడార్ 3%ణ% టాక్టికల్ కంట్రోల్ రాడార్


సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో

డిస్ట్రాయర్లు, స్వదేశీ విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫ్రిగేట్లు, కార్వెట్‌లు, ఫాస్ట్ పెట్రోల్ నౌకలు, ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్ మరియు ఆఫ్‌షోర్ పెట్రోల్ నౌకలు వంటి నావికా ఆస్తులు. రికార్డు స్థాయిలో సేకరణ ఒప్పందాలు, iDEX కింద ఆవిష్కరణలు, SRIJAN వంటి డ్రైవ్‌లు, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లతో ప్రభుత్వం ఈ వృద్ధికి మద్దతు ఇచ్చింది. (లైట్ కంబాట్ హెలికాప్టర్లు), ప్రచండ్ హెలికాప్టర్లు, (అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్‌కు ఆమోదం) వంటి కీలక కొనుగోళ్లు స్వదేశీ సామర్థ్యం వైపు మార్పును హైలైట్ చేస్తాయి. ఆపరేషన్ సిందూర్ కేవలం వ్యూహాత్మక విజయాల కథ కాదు. ఇది భారతదేశ రక్షణ స్వదేశీకరణ విధానాలకు ధ్రువీకరణ. వాయు రక్షణ వ్యవస్థల నుండి డ్రోన్‌ల వరకు, కౌంటర్-యుఎఎస్ సామర్థ్యాల నుండి నెట్-కేంద్రీకృత యుద్ధ వేదికల వరకు, స్వదేశీ సాంకేతికత అత్యంత ముఖ్యమైన సమయంలో అందించింది. ప్రైవేట్ రంగ ఆవిష్కరణ, ప్రభుత్వ రంగ అమలు, సైనిక దృక్పథం కలయిక భారతదేశం తన ప్రజలను, భూభాగాన్ని రక్షించుకోవడమే కాకుండా 21వ శతాబ్దంలో హైటెక్ సైనిక శక్తిగా తన పాత్రను నొక్కి చెప్పడానికి వీలు కల్పించింది. భవిష్యత్ సంఘర్షణలలో, యుద్ధభూమి సాంకేతికత ద్వారా మరింతగా రూపుదిద్దుకుంటుంది. ఆపరేషన్ సిందూర్‌లో చూపిన విధంగా భారతదేశం సిద్ధంగా ఉంది, దాని స్వంత ఆవిష్కరణలతో సాయుధమైంది.

డ్రోన్ పవర్ వ్యాపారం

డ్రోన్ ఫెడరేషన్ ఇండియా , 550 కి పైగా డ్రోన్ కంపెనీలు, 5500 డ్రోన్ పైలట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ప్రముఖ పరిశ్రమ సంస్థ. 2030 నాటికి భారతదేశాన్ని ప్రపంచ డ్రోన్ హబ్‌గా మార్చడమే DFI లక్ష్యం. ఇది ప్రపంచవ్యాప్తంగా భారతీయ డ్రోన్, కౌంటర్-డ్రోన్ టెక్నాలజీ రూపకల్పన, అభివృద్ధి, తయారీ, స్వీకరణ, ఎగుమతిని ప్రోత్సహిస్తుంది. DFI వ్యాపారాన్ని సులభతరం చేస్తుంది, డ్రోన్ టెక్నాలజీని స్వీకరించడాన్ని ప్రోత్సహిస్తుంది. భారత్ డ్రోన్ మహోత్సవ్ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

# మళ్లీ విజృంభిస్తోన్న కరోనా.. రూపం మార్చుకుని అటాక్.. ఈ సారి చాలా డేంజర్..!



కరోనా మళ్లీ విజృంభించబోతోందా..? పాత శత్రువు కొత్త రూపం సంతరించుకుందా..? ఈ సారి వస్తే.. అంత ఈజీగా వదలదా.? 2019నాటి లాక్‌డౌన్ పరిస్థితులు రాబోతున్నాయా..? అంటే అవుననే సమాధానం వస్తోంది వైద్యనిపుణుల నుంచి. ఈసారి వచ్చేది మామూలు కరోనా వేరియంట్ కాదని.. దానితో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలూ వస్తున్నాయి. ఇప్పటికే మన పక్కదేశాలను కరోనా వైరస్ కమ్మేసింది. ఇక ప్రపంచాన్ని కుదిపేసుందుకు రెడీ అవుతోందన్న వార్నింగ్ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే హాంకాంగ్, సింగపూర్‌లలో కోవిడ్ కేసులు గణనీయంగా పెరిగాయి. ఈ రెండు నగరాల్లోనే కాకుండా ఆసియాలోని ఇతర ప్రాంతాల్లో కూడా కొత్త కోవిడ్ వేవ్ భయాలు ఎక్కువయ్యాయి. వేసవి కాలం కొనసాగుతున్నప్పటికీ వైరస్ వ్యాప్తి చెందుతుండటం మరింత కలవరం పెడుతోంది. హాంకాంగ్‌లో కోవిడ్-పాజిటివ్ కేసుల శాతం రోజురోజుకూ పెరుగుతోంది. మే 3 నుంచి మరణాలతో సహా కేసులు అధిక సంఖ్యలో నమోదైనట్లు అక్కడి ఆరోగ్యశాఖ ప్రకటించింది. 7 మిలియన్లకు పైగా జనాభా ఉన్న నగరంలో గత రెండేళ్లలో నమోదైన కేసులతో పోలిస్తే సంఖ్య తక్కువే అయినా, వైరల్ లోడ్, కోవిడ్ సంబంధిత అనారోగ్యం, ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య బాగా పెరిగిందని అధికారులు తెలిపారు. సింగపూర్‌లో కూడా.. ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మే 3 నుంచి వారంలో కొత్త కేసుల సంఖ్య అంతకు ముందు ఏడు రోజులతో పోలిస్తే 28 శాతం పెరిగి 14వేల200కు చేరుకుంది. రోజువారీ ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య కూడా దాదాపు 30 శాతం పెరిగింది. జనాభాలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల కేసులు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక చైనా విషయానికి వస్తే.. అక్కడి అధికారులు కూడా కోవిడ్ కేసుల పెరుగుదలను నిశితంగా పరిశీలిస్తున్నారు. చైనా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం, దేశంలో కోవిడ్ వ్యాప్తి గత సంవత్సరం వేసవిలో గరిష్ట స్థాయికి చేరుకున్నట్లుగానే ఇప్పుడు కూడా అదే దిశగా కొనసాగుతోంది. మే 4 వరకు ఉన్న ఐదు వారాల్లో ప్రధాన ఆసుపత్రులలో కోవిడ్ పాజిటివిటీ రేటు రెట్టింపు కంటే ఎక్కువగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా ప్రకారం సార్స్ కొవిడ్-2 పాజిటివిటీ రేటు 7.3% నుండి 5.0%కి తగ్గినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కేసులు పెరుగుతున్నాయి. ఈ వైరస్ కొత్త వేరియంట్ JN.1, వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్..VOI గా వర్గీకరించబడింది, 2025లో 16.3% సీక్వెన్స్‌లలో కనిపించిందీ వైరస్. అలాగే, LP.8.1, LP.1 వంటి వేరియంట్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. ఇక మన దేశంలో కూడా కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలొస్తున్నాయి. హాస్పిటల్ అడ్మిషన్లు, ముఖ్యంగా వృద్ధులు, ఇతర వ్యాధులతో బాధపడే వారిలో కొవిడ్ ప్రభావం తీవ్రంగా ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అపోలో హాస్పిటల్స్ విడుదల చేసిన "హెల్త్ ఆఫ్ ది నేషన్ 2025" నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా 25 లక్షల మందిని పరీక్షించిన తర్వాత, శ్వాసకోశ సంబంధిత సమస్యలు, వైరల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నట్టు తేలింది. ఈ పరిస్థితి జనంలో భయాందోళనలను మరింత పెంచింది. సో..ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.




## ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుడ్ న్యూస్.. స్టార్ ప్లేయర్ రాకకు లైన్ క్లియర్!



ఐపీఎల్ 2025 పునఃప్రారం వేళ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓ గుడ్ న్యూస్ అందింది. ఐపీఎల్ మిగిలిన మ్యాచ్‌లో ఆడేందుకు ముస్తఫిజుర్ రెహ్మాన్‌కు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అతడు శనివారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరనున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి.కాగా ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ వారం రోజులు వాయిదా పడడంతో చాలా మంది ఫారన్ ప్లేయర్లు తమ స్వదేశానికి వెళ్లిపోయారు. అయితే ఐపీఎల్ రీ స్టార్ట్ అవుతుండడంతో కొంతమంది తిరిగి భారత్‌కు రావడానికి సిద్ధపడితే, మరి కొంతమంది నిరాకరించారు. అందులో ఒకరు ఆస్ట్రేలియా యువ సంచలనం జేక్ ఫ్రెజర్ మెక్‌గర్క్. ఐపీఎల్ 16వ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు తన అందుబాటులో ఉండదని మెక్‌గర్క్ ఢిల్లీ ఫ్రాంచైజీకి తెలియజేశాడు. ఈ క్రమంలో మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాపేసర్ ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. అయితే ఇక్కడే అస్సలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ముస్తఫిజుర్‌తో ఢిల్లీ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికి అతడు యూఏఈతో టీ20 సిరీస్ ఆడేందుకు దుబాయ్‌కు పయనమయ్యాడు. యాదృచ్ఛికంగా యూఏఈ-బంగ్లా సిరీస్ కూడా మే 17 నుంచి ప్రారంభం కానుంది. దీంతో అతడు తిరిగి భారత్‌కు వస్తాడా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ఎట్టకేలకు బంగ్లా క్రికెట్ బోర్డు అతడికి ఎన్‌వోసీ మంజూరు చేయడంతో ఢిల్లీ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ఏడాది సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ప్లేయర్లు మిచెల్ స్టార్క్, ఫాఫ్ డుప్లెసిస్ సైతం దూరమయ్యారు. ఈ ఏడాది సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మూడు మ్యాచ్‌లలోనూ ఢిల్లీ విజయం సాధిస్తే ఎటువంటి సమీకరణాలు అవసరం లేకుండా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది.

## గతేడాది టెస్టులకు వీడ్కోలు.. దిగ్గజ పేసర్ రీఎంట్రీ



ఇంగ్లండ్ దిగ్గజ పేసర్ జేమ్స్ ఆండర్సన్ పునరాగమనానికి రంగం సిద్ధమైంది. నలభై రెండేళ్ల ఈ స్పీడ్‌స్టర్ దేశీ క్రికెట్ బరిలో దిగబోతున్నాడు. కౌంటీ చాంపియన్‌షిప్ డివిజన్ 2లో భాగంగా లంకాషైర్ జట్టుకు ఆడనున్నాడు. ఇందుకు సంబంధించి లంకాషైర్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. జట్టులో జేమ్స్ ఆండర్సన్‌కు చోటు ఇచ్చినట్లు వెల్లడించింది. ?కాగా.. గతేడాది ఆండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వెస్టిండీస్‌తో లార్డ్స్ వేదికగా జూలై నాటి టెస్టుతో ఇంగ్లండ్ జట్టుతో అతడి ప్రయాణం ముగిసి పోయింది. ఆ తర్వాత ఇంగ్లండ్ పురుషుల క్రికెట్ జట్టుకు ఆండర్సన్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా వ్యవహరించాడు. అయితే, ఆ పనికి కూడా స్వస్తి పలికి ఆటగాడిగా మరోసారి రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. మాంచెస్టర్ వేదికగా శుక్రవారం నుంచి డెర్బిషైర్‌తో జరిగే కౌంటీ మ్యాచ్‌తో అతడు మైదానంలో దిగుతున్నాడు.

**704 వికెట్లు**

కాగా 2003లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన జేమ్స్ ఆండర్సన్.. ఇంగ్లండ్ తరఫున 188 టెస్టులు, 194 వన్డేలు, 19 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో ఏకంగా 704 వికెట్లు కూల్చి.. ఈ అరుదైన మైలురాయి చేరుకున్న తొలి పేసర్‌గా చరిత్రకెక్కాడు. అంతేకాదు ఆండర్సన్ ఒకే ఇన్నింగ్స్‌లో 32సార్లు నాలుగు వికెట్లు, 32 సార్లు ఐదు వికెట్లు, మూడుసార్లు పది వికెట్లు పడగొట్టాడు. అంతేకాదు ఒకే వేదికపై టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన ఫాస్ట్‌బౌలర్‌గానూ రికార్డు సాధించాడు. లార్డ్స్ మైదానంలో అతడు 29 టెస్టుల్లో కలిపి 2.71 ఎకానమీతో 123 వికెట్లు తీశాడు.ఇక వన్డేల్లో 269 వికెట్లు కూల్చిన ఈ రైటార్మ్ ఫాస్ట్ బౌలర్.. అంతర్జాతీయ టీ20లలో 18 వికెట్లు పడగొట్టాడు.

**లంకాషైర్ జట్టు**

మార్కస్ హ్యారిస్ (కెప్టెన్), జేమ్స్ ఆండర్సన్, టామ్ బెయిలీ, జార్జ్ బాల్డర్‌సన్, జార్జ్ బెల్, జోష్ బొహానన్, టామ్ హార్ట్లీ, మ్యాట్ హర్స్ట్, కీటన్ జెన్నింగ్స్, మైకేల్ జోన్స్, ఆండర్సన్ ఫిలిప్, ఓలీ సటాన్, ల్యూక్ వెల్స్, విల్‌వియమ్స్.

ఇంగ్లండ్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సౌతీ

మరోవైపు.. ఆండర్సన్ స్థానంలో న్యూజిలాండ్ మాజీ పేసర్ టిమ్ సౌతీని ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ప్రత్యేక నైపుణ్య సలహాదారుగా నియమించుకుంది. త్వరలో ఇంగ్లండ్, భారత్‌ల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ వరకే ఈ నియామకం జరిగినట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తెలిపింది. వచ్చే నెల ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత్ అక్కడ ఐదు టెస్టుల ముఖాముఖి సిరీస్‌లో తలపడుతుంది. ముందుగా లీడ్స్ వేదికగా జూన్ 20 నుంచి తొలి టెస్టు జరుగుతుంది. జూలై 31 నుంచి ద ఓవల్‌లో జరిగే ఆఖరి టెస్టుతో సంప్రదాయ సిరీస్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎంతో అనుభవజ్ఞుడైన కివీ పేసర్ సౌతీ సేవల్ని ఉపయోగించుకొని సిరీస్‌లో లబ్ధి పొందాలని ఇంగ్లండ్ బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. 36 ఏళ్ల మాజీ సీమర్ గత డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. కెరీర్‌లో 107 టెస్టులాడి 391 వికెట్లు తీశాడు. 161 వన్డేల్లో 221 వికెట్లు, 126 టీ20ల్లో 164 వికెట్లు తీసిన కివీస్ గ్రేటెస్ట్ బౌలర్ సౌతీ. భారత్‌తో సిరీస్ కంటేముందు ఇంగ్లండ్ ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికపై జింబాబ్వేతో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఈ నెల 22 నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది.

## వారి త్యాగాల వల్లే ఇలా ఉన్నా.. అరుదైన గౌరవం.. రోహిత్ శర్మ భావోద్వేగం




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ను ముంబై క్రికెట్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. వాంఖడే స్టేడియం లో రోహిత్ శర్మ పేరిట ఉన్న స్టాండ్‌ను శుక్రవారం ఆరంభించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి రోహిత్ తల్లిదండ్రులు పూర్ణిమా శర్మ- గురునాథ్ శర్మ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్టేడియంలో రోహిత్ శర్మ స్టాండ్‌ను ఆవిష్కరించారు.

ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు : ఆ సమయంలో సీనియర్ నేత శరద్ పవార్, భారత జట్టు మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్‌లతో పాటు హిట్‌మ్యాన్ సతీమణి రితికా సజ్దే కూడా అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా రోహిత్ శర్మ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. "ఇక్కడి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు. అసలు ఇలాంటి ఓ రోజు వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. ముంబైకి.. టీమిండియాకు ఆడాలని కలలు కంటూ పెరిగాను. దేశానికి నా వంతు సేవ చేయాలని భావించాను. ఈ క్రమంలోనే ఎన్నో విజయాలు సాధించాను. కఠిన సవాళ్లు ఎదుర్కొంటూ ఎన్నెన్నో మైలురాళ్లు అధిగమించాను. అయితే, వాటన్నింటికంటే ఈరోజు ఎంతో ప్రత్యేకమైనది. వాంఖడే వంటి ప్రసిద్ధ స్టేడియంలో నా పేరు ఇలా.. ఈ మైదానంతో నాకెన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి.

మాటల్లో వర్ణించలేను : ప్రపంచంలోని పేరెన్నికగన్న రాజకీయ నాయ కులతో పాటు నా పేరు ఉండటం.. హెూ.. ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. ఎంసీఏ సభ్యులు, యాజమాన్యానికి నేను కృతజ్ఞు డిని. నేను ఇంకా క్రికెటర్‌గా కొనసాగుతున్న సమయంలోనే ఇలాం టి గౌరవం దక్కడం ఎంతో ఎంతో ప్రత్యేకం. రెండు ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యాను. ఇంకో ఫార్మాట్ ఆడుతూనే ఉన్నాను. నిజం గా ఈ భావనను మాటల్లో ఎలా చెప్పాలో తెలియడం లేదు. టీమిం డియా తరఫున, ఐపీఎల్‌లో ముంబై తరఫున ఇక్కడికే వచ్చి మళ్లీ ఆడబోతున్నా. ఇంతకంటే గొప్పది నా జీవితంలో మరొకటి ఉండదు.

వారి త్యాగాలు మరువలేనివి : మా అమ్మానాన్న, నా భార్య, తమ్ముడు, మరదలు.. ఇలా కుటుంబమంతా ఇక్కడే ఉంది. వారందరి సమక్షంలో ఈ గౌ ర వం అందుకోవడం నాకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది. నా కోసం వారంతా తమ జీవితంలోని చాలా సంతోషాలను త్యాగం చేశారు. మా ముంబై ఇండియన్స్ జట్టు కూడా ఇక్కడే ఉంది. నా ప్రసంగం ముగిసిన వెంటనే వాళ్లు మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెడతారు" అంటూ రోహిత్ శర్మ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బై పోయాడు. కాగా టీ20 ప్రపంచకప్-2024 తర్వాత అంత ర్జాతీయ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. ఇటీవలే టెస్టులకు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే, వన్డేల్లో మాత్రం కొనసాగనున్నాడు. ఇక టీ20 ప్రపంచకప్-2024తో పాటు టీమిం డియాకు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 అందించిన ఘనత రోహిత్ సొంతం. తద్వారా మహేంద్ర సింగ్ ధోని (3) తర్వా త భారత్‌కు అత్యధిక (రెండు) ఐసీసీ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా రికార్డు సాధించాడు. ఇదిలా ఉంటే.. వాంఖ డేలో ఇప్పటి వరకు సునీల్ గావస్కర్, సచిన్ టెండుల్కర్, వినోద్ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్ పేరిట స్టాండ్స్ ఉన్నాయి. తాజాగా రోహిత్ కూడా ఈ జాబితాలో చేరిపోయాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్.. హ్యాండ్ ఇచ్చిన స్టార్ ప్లేయర్?



ఐపీఎల్ 2025 పునఃప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఏడాది సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు ఆ జట్టు స్టార్ బ్యాటర్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ దూరంగా ఉండనున్నాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సేవలను కోల్పోయిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు డుప్లెసిస్ సైతం ఊహించని షాకిచ్చాడు. భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల కారణంగా ఈ ఏడాది క్యాష్ రిచ్ లీగ్ సీజన్ వారం రోజుల పాటు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో డుప్లెసిస్ తన స్వదేశానికి వెళ్లిపోయాడు. అయితే దక్షిణాఫ్రికాకు వెళ్లిపోయిన డుప్లెసిస్ తిరిగి భారత్‌కు వచ్చేందుకు తిరస్కరించినట్లు ఈఎస్పీఎన్ క్రిక్ ఇన్ఫో తమ కథనంలో పేర్కొంది. డుప్లెసిస్ ప్రస్తుతం తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో డుప్లెసిస్ గాయం కారణంగా కేవలం ఆరు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. మిగితా ఆరు మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే డుప్లెసిస్ గత కొన్ని మ్యాచ్‌ల్లో ఢిల్లీ తరఫున ఆడినప్పటికి, అతడు ఇంకా పూర్తి ఫిట్ సాధించకపోయినట్లు సమాచారం. ఈ క్రమంలో ఫాఫ్ సౌతాఫ్రికాలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరో సౌతాఫ్రికా ఆటగాడు డోనోవన్ ఫెర్రీరా సైతం ఢిల్లీ క్యాపిటల్స్‌కు హ్యాండ్ ఇచ్చాడు. అతడు కూడా తిరిగి ఐపీఎల్‌లో పాల్గోనేందుకు రావడం లేదని ఢిల్లీ ఫ్రాంచైజీకి తెలియజేశాడు. వీరిద్దరి కంటే ముందు మిచెల్ స్టార్క్, జాక్ ఫ్రెజర్ మెక్‌గర్క్ సైతం ఈ ఏడాది సీజన్ నుంచి వైదొలగారు.

**ముగ్గురే ముగ్గురు..**

దీంతో ప్రస్తుతం ఢిల్లీ జట్టులో కేవలం ముగ్గురు విదేశీ ఆటగాళ్లు మాత్రమే మిగిలారు. ట్రిస్టన్ స్టబ్స్, శ్రీలంక పేసర్ దుష్మంత చమీర, బంగ్లాదేశ్ స్పీడ్ స్టార్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ విదేశీ ప్లేయర్లుగా ఉన్నారు. ఫ్రేజర్-మెక్‌గుర్క్ స్థానంలో ముస్తాఫిజుర్ రెహమాన్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికి.. అతడికి ఇంకా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఎన్‌వోసీ మంజూరు చేయలేదు. దీంతో అతడు ఇంకా ఢిల్లీ జట్టుతో చేరలేదు. ప్రస్తుతం బంగ్లా క్రికెట్ బోర్డుతో బీసీసీఐ సంప్రదింపులు జరుపుతోంది. ఈ ఏడాది సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మూడు మ్యాచ్‌లలోనూ ఢిల్లీ విజయం సాధిస్తే ఎటువంటి సమీకరణాలు అవసరం లేకుండా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది.

## 'గిల్ వద్దు.. టీమిండియా కెప్టెన్‌గా అతడే బెటర్'



ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియాకు కొత్త టెస్టు కెప్టెన్ ఎంపిక చేసే పనిలో బీసీసీఐ సెలక్షన్ కమిటీ పడింది. రోహిత్ శర్మ అనూహ్యంగా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. పలు నివేదికల ప్రకారం టెస్టు కెప్టెన్సీ రేసులో స్టార్ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అతడితో పాటు పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా పేరు కూడా విన్పిస్తోంది. కానీ గిల్ తో పోలిస్తే బుమ్రాకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి. గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించకూడదని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అనుభవం లేని గిల్ వైపు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మొగ్గు చూపుతుండడం క్రికెట్ వర్గాల్లో అసంతృప్తికి దారితీసినట్లు తెలుస్తోంది. చాలా మంది మాజీలు భారత టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు గిల్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ఇదే విషయంపై భారత మాజీ ఓపెనర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా కొత్త టెస్టు కెప్టెన్‌గా బుమ్రా ఉండాలని, శుబ్‌మన్ గిల్‌ను అతడి డిప్యూటీగా ఎంపిక చేయాలని జాఫర్ అభిప్రాయపడ్డాడు.

"భారత టెస్టు కెప్టెన్సీ రేసులో జస్ప్రీత్ బుమ్రా ముందంజలో ఉంటాడాని భావిస్తున్నాను. ఒకవేళ తనంతట తానుగా కెప్టెన్సీ ఆఫర్ తిరస్కరిస్తే తప్ప సెలక్టర్లు మరో ఆప్షన్‌ను పరిశీలించరు. అతడిని కెప్టెన్‌గా చేసి గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయాలి. బుమ్రాకు విశ్రాంతి అవసరమైనప్పుడల్లా గిల్ జట్టును నడిపిస్తున్నాడు. దీంతో గిల్‌కు పూర్తి స్థాయి కెప్టెన్‌గా ఎదిగేందుకు తగినంత సమయం లభిస్తోంది" అని జాఫర్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. కాగా గిల్‌కు కెప్టెన్‌గా అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా అనుభవం లేదు. జింబాబ్వే సిరీస్‌లో భారత జట్టు సారథిగా గిల్ వ్యవహరించాడు. ఆ తర్వాత ఎప్పుడూ భారత జట్టును నడిపించలేదు. ఐపీఎల్ మాత్రం కెప్టెన్‌గా అతడికి అనుభవం ఉంది. గుజరాత్ టైటాన్స్ సారథిగా గిల్ కొనసాగుతున్నాడు. ఇక? ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టును మే 23న బీసీసీఐ ప్రకటించే అవకాశముంది.

## నేను కోచ్‌గా ఉండుంటే.. రోహిత్‌కు అలా జరిగేది కాదు: రవిశాస్త్రి





**టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవలే తన 12 ఏళ్ల టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ తన రిటైర్మెంట్‌కు ముందు టెస్టు క్రికెట్‌లో కెప్టెన్‌గా, ఆటగాడిగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాడు. న్యూజిలాండ్ చేతిలో భారత్ తొలిసారి టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్ కావడం, ఆస్ట్రేలియాతో బీజీటీలో చిత్తుగా ఓడి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూరం కావడం వంటివి రోహిత్‌ను మానసికంగా దెబ్బతీశాయనే చెప్పుకోవాలి. రోహిత్ తన కెరీర్‌లో చివరి టెస్టు మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాపై ఆడాడు. ఆ తర్వాత బీజీటీలోని ఆఖరి మ్యాచ్ నుంచి హిట్ మ్యాన్ స్వచ్ఛందంగా తానంతట తనే తప్పుకున్నాడు. దీంతో కనీసం ఫేర్‌వెల్ మ్యాచ్ లేకుండానే రోహిత్ తన కెరీర్‌ను ముగించాడు.**

**ఈ క్రమంలో భారత మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తను కోచ్‌గా ఉండుంటే, సిడ్నీ టెస్టులో రోహిత్ ఆడేవాడని రవిశాస్త్రి వెల్లడించాడు. "ఐపీఎల్-2025 సీజన్ టాస్ సమయంలో రోహిత్ శర్మ ప్రాక్టీస్ చేస్తుండగా చాలాసార్లు చూశాను. కానీ ఆ సమయంలో అతడితో మాట్లాడటానికి తగినంత సమయం దొరకలేదు. ఓసారి మాత్రం అతడి దగ్గరకు వెళ్లి భుజంపై చేయి వేసి మాట్లాడాను. నేను కోచ్‌గా ఉండుంటే సిడ్నీ టెస్టు(బీజీటీలో ఆఖరి టెస్టు)లో ఆడకుండా ఉండేవాడివి కాదు అని చెప్పా. సిరీస్ అప్పటికి ఇంకా ముగియలేదు కాబట్టి కచ్చితంగా మిమ్మల్ని ఆడించేవాడిని. ఎందుకంటే 2-1తో ప్రత్యర్థి జట్టు ముందంజలో ఉన్నా, నేను వెనకడుగు వేసే వ్యక్తిని కాదు. ఆఖరి టెస్టు మ్యాచ్ 30-40 పరుగుల తేడాతో సాగింది. సిడ్నీ పిచ్ చాలా ట్రిక్కీగా ఉంది. రోహిత్ ఫామ్‌లో ఉన్న లేకపోయానా జట్టులో కచ్చితంగా ఉండాల్సిందే. ఎందుకంటే అతడు మ్యాచ్ విన్నర్. సరిగ్గా ఇదే విషయం రోహిత్ కూడా చెప్పాను. ఒకవేళ రోహిత్ ఆ మ్యాచ్‌లో ఆడి అక్కడ పరిస్థితులకు తగ్గట్టు జట్టును నడిపించి ఉంటే సిరీస్ సమమయ్యేది. అయితే ప్రతీ కోచ్‌కు వేర్వేరు స్టైల్స్ ఉంటాయి. ఇది నా శైలి. కేవలం నా ఆలోచిన విధానాన్ని మాత్రమే రోహిత్‌కు తెలియజేశాను. ఎప్పటి నుంచో ఇది నా మనసులో ఉంది. ఎట్టకేలకు అతడికి తెలియజేశాను" అని ఐసీసీ రివ్యూలో రవిశాస్త్రి పేర్కొన్నాడు. కాగా రవిశాస్త్రి వ్యాఖ్య లు బట్టి చూస్తే ప్రస్తుత భారత హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌కు పరోక్షంగా కౌంటరిచ్చినట్లు అన్పిస్తోంది. గంభీర్‌తో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికి విభేదాలు తలెత్తినట్లు ప్రచారం సాగుతోంది. ఈ ?క్రమంలో రో-కో టెస్టులకు వీడ్కోలు పలికినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.**

RNI : APTEL/2023/88525
జనం న్యూస్
తెలుగు జాతీయ దినపత్రిక

సోమవారం - 19 - మే - 2025

# లక్ష టికెట్లతో 'మిషన్ ఇంపాజిబుల్' బెస్ట్ ఓపెనింగ్స్




టామ్ క్రూజ్ నటించిన 'మిషన్ ఇంపాజిబుల్- ది ఫైనల్ రికనింగ్' ఇండియాలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగులు రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి. ఇంకా ముందస్తు బుకింగులు ఓపెన్ కాక ముందు, కేవలం 12 గంటల్లోనే టాప్ నేషనల్ మల్టీప్లెక్స్ చైన్లలో 1,00,000 టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఇది సిరీస్ లో ఎనిమిదో సినిమా కాగా, మునుపటి చిత్రానికి సీక్వెల్ గా తెరకెక్కింది. తాజా బాక్సాఫీస్ లెక్కల ప్రకారం..

ది ఫైనల్ రెకనింగ్ భారతదేశంలో ప్రారంభ రోజున రూ. 15 కోట్ల మార్కును అధిగమించి డెడ్ రికనింగ్ మొదటి భాగం వసూళ్లను అధిగమించింది. 2023లో రూ. 12.25 కోట్ల ఓపెనింగులతో పార్ట్ 1 విడుదల కాగా, పార్ట్ 2 ఆ రికార్డును చెరిపేసింది. ఈ శనివారం నాడు బుకింగుల్లో మరింత హుషారు కనిపిస్తుందని అంచనా.

క్రిస్టోఫర్ మెక్‌క్వారీ దర్శ కత్వం వహించిన 'ది ఫైనల్ రికనింగ్' గత ఏడాది వచ్చిన 'డెడ్ రికనింగ్'కు సీక్వెల్. 2 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివి ఉన్న చిత్రమిది. సీబీఎఫ్‌సి నుండి U/A సర్టిఫికేషన్ పొందింది. సమ్మెలు గొడవలతో నిర్మాణం పరంగా ఆలస్యాల్ని ఎదుర్కొన్న చిత్రబృందం 2024 చివరి నాటికి చిత్రీకరణను పూర్తి చేసి మే 5న టోక్యోలో ప్రీమియర్ ని ప్రదర్శించింది. మే 14న జరిగిన 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోను ప్రదర్శించారు. అక్కడ దీనికి 5 నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ లభించింది. ఈ చిత్రాన్ని భారతదేశంలో వయాకామ్ 18 పంపిణీ చేస్తోంది. దేశవ్యాప్తంగా 3,000 కంటే ఎక్కువ స్క్రీన్‌లలో విడుదల చేస్తున్నారు. టైర్-2 , టైర్-3 మార్కెట్‌లలో హిందీ-డబ్బింగ్ షోలపై దృష్టి సారించి, ఇంగ్లీష్ వెర్షన్‌తో టైర్-వన్ నగరాల్లోని మల్టీప్లెక్స్ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని రిలీజ్ చేయ స్తున్నారని సమాచారం. భారత దేశంలో డెడ్ రెకనింగ్ మొదటి భాగం జీవితకాల వసూళ్లు రూ. 106 కోట్లు కాగా ఈ రికార్డును పార్ట్ 2 బ్రేక్ చేస్తుందని అంచనా.


# ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఎలా ఉంది..?

హాలీవుడ్ సినిమాల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉన్న సినిమాలు ఫైనల్ డెస్టినేషన్. అదేంటో తెర మీద జనాలు ఎలా చనిపోతారు అన్నది కథగా చూపిస్తూ ఫైనల్ డెస్టినేషన్ సీరీస్ లు ఆడియన్స్ లో ఒక భయాన్ని ఉతుకతను ఏర్పడేలా చేస్తాయి. దాదాపు పాతికేళ్ల క్రితం అంటే 2000 సంవత్సరం లో వచ్చిన ఫైనల్ డెస్టినేషన్ సినిమా సూపర్ హిట్ కాగా ఆ సినిమా చూసిన ఆడియన్స్ భయంతో వణికిపోయారు. ఐతే ఫైనల్ డెస్టినేషన్ ఈ పాతికేళ్లలో ఆరు సీరీస్ లు తీశారు. ఐతే లేటెస్ట్ సీరీస్ కు మాత్రం దాదాపు 14 ఏళ్ల దాకా టైం తీసుకున్నారు. లేటెస్ట్ గా ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ అంటూ కొత్త సీరీస్ ని ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చారు. ఈ కథ కూడా 1986 లోనే మొదలవుతుంది. ఆ టైం లో స్కై వ్యూ హెూటల్ లో జరిగే ప్రమాదాన్ని ముందు ఊహించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఐరిస్ (గాబ్రియల్ రోస్) ప్రయత్నిస్తుంది. ఐతే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని తన వాళ్లను పోగొట్టుకుంటుంది. ఐతే ఎంతో ప్లానింగ్ తో ఉన్నా ఐరిస్ కుటుంబాన్ని చావు ఎలా వెంబడించింది అన్నదే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ కథ. ఈ సినిమాలో కయిట్లిన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసింది. సీనియర్ ఐరిస్ గా గాబ్రియల్ అలా ఉన్న కొద్దిసేపైనా అదరగొట్టేసింది. ఇక ప్రతి పాత్రని దర్శకుడు చంపేసే సీన్స్ అయితే బాబోయ్ అనిపిస్తుంది. తెర మీద ఈ సీన్స్ అన్నీ ఎంతో న్యాచురల్ గా అనిపించడానికి సపోర్ట్ చేసిన సీజీఐ టీం ఇంకా కెమెరా వర్క్ ని మెచ్చుకోవాల్సిందే. ఐతే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఇంపార్టెంట్ సీన్స్ అన్నీ కూడా ప్రోమోస్ లో వదలడం కాస్త ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఈ సినిమా టెక్నికల్ గా చాలా మంచి అవుట్ పుట్ ఇచ్చారు. ఐతే స్క్రీన్ ప్లే విషయంలో ఇంకాస్త వర్క్ చేసి ఉంటే బాగుండేది. ఈ ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్ కథ మరీ ప్రెడిక్టబుల్ గా ఉండటం స్క్రీన్ ప్లే కూడా అంత ఆసక్తికరంగా లేకపోవడం వల్ల జస్ట్ ఓకే అనిపిస్తుంది. ఆ సీరీస్ ని ఇష్టపడే ఫ్యాన్స్ ఇంకా ఇదే టైం హార్రర్ సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ కి ఈ సినిమా నచ్చే ఛాన్స్ ఉంటుంది.






# ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఎలా ఉంది..?




హాలీవుడ్ సినిమాల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉన్న సినిమాలు ఫైనల్ డెస్టినేషన్. అదేంటో తెర మీద జనాలు ఎలా చనిపోతారు అన్నది కథగా చూపిస్తూ ఫైనల్ డెస్టినేషన్ సీరీస్ లు ఆడియన్స్ లో ఒక భయాన్ని ఉతుకతను ఏర్పడేలా చేస్తాయి. దాదాపు పాతికేళ్ల క్రితం అంటే 2000 సంవత్సరం లో వచ్చిన ఫైనల్ డెస్టినేషన్ సినిమా సూపర్ హిట్ కాగా ఆ సినిమా చూసిన ఆడియన్స్ భయంతో వణికిపోయారు. ఐతే ఫైనల్ డెస్టినేషన్ ఈ పాతికేళ్లలో ఆరు సీరీస్ లు తీశారు.ఐతే లేటెస్ట్ సీరీస్ కు మాత్రం దాదాపు 14 ఏళ్ల దాకా టైం తీసుకున్నారు. లేటెస్ట్ గా ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ అంటూ కొత్త సీరీస్ ని ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చారు. ఈ కథ కూడా 1986 లోనే మొదలవుతుంది. ఆ టైం లో స్కై వ్యూ హెూటల్ లో జరిగే ప్రమాదాన్ని ముందు ఊహించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఐరిస్ (గాబ్రియల్ రోస్) ప్రయత్నిస్తుంది. ఐతే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని తన వాళ్లను పోగొట్టుకుంటుంది. ఐతే ఎంతో ప్లానింగ్ తో ఉన్నా ఐరిస్ కుటుంబాన్ని చావు ఎలా వెంబడించింది అన్నదే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ కథ.ఈ సినిమాలో కయిట్లిన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసింది. సీనియర్ ఐరిస్ గా గాబ్రియల్ అలా ఉన్న కొద్దిసేపైనా అదరగొట్టేసింది. ఇక ప్రతి పాత్రని దర్శకుడు చంపేసే సీన్స్ అయితే బాబోయ్ అనిపిస్తుంది. తెర మీద ఈ సీన్స్ అన్నీ ఎంతో న్యాచురల్ గా అనిపించడానికి సపోర్ట్ చేసిన సీజీఐ టీం ఇంకా కెమెరా వర్క్ ని మెచ్చుకోవాల్సిందే. ఐతే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఇంపార్టెంట్ సీన్స్ అన్నీ కూడా ప్రోమోస్ లో వదలడం కాస్త ఆశ్చర్యకరంగా ఉంటుంది.ఈ సినిమా టెక్నికల్ గా చాలా మంచి అవుట్ పుట్ ఇచ్చారు. ఐతే స్క్రీన్ ప్లే విషయంలో ఇంకాస్త వర్క్ చేసి ఉంటే బాగుండేది. ఈ ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్ కథ మరీ ప్రెడిక్టబుల్ గా ఉండటం స్క్రీన్ ప్లే కూడా అంత ఆసక్తికరంగా లేకపోవడం వల్ల జస్ట్ ఓకే అనిపిస్తుంది. ఆ సీరీస్ ని ఇష్టపడే ఫ్యాన్స్ ఇంకా ఇదే టైం హార్రర్ సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ కి ఈ సినిమా నచ్చే ఛాన్స్ ఉంటుంది.

# రణ్‌బీర్ 'రామాయణ'లో మండోదరి ఎవరు?



దంగల్ -% చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న దర్శకుడిగా రెండు వేల కోట్ల క్లబ్‌లో చేరిన నితేష్ తివారి ప్రస్తుతం భారతీయ ఇతిహాసం రామాయణాన్ని %-%రామాయణ%-%గా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. స్టోరీ స్క్రీన్‌ప్లే నమిత్‌మల్హోత్రా అందిస్తుండగా, స్టోరీని మాత్రం శ్రీధర్ రాఘవన్ అందిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తున్న ఈ మూవీని నమిత్‌మల్హోత్రా, హీరో యష్ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ రామాయణ ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్నారు. ఇందులో మొదటి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనుండగా, రెండవ భాగాన్ని 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఇందులో రావణుడిగా యష్ నటిస్తుండగా హను మంతుడిగా సన్నీ డియోల్ కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రాకెట్ స్పీడుతో ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది.క్రేజీ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కూడా ఈ మేగ్నమ్ ఓపస్ లో భాగం అయినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుందని, ఆమె మండోదరిగా నటించనుందని ఇన్ సైడ్ టాక్. యష్ రావణాసుడిగా నటిస్తుండగా అతనికి జోడీగా రావణుడి సతీమణి పాత్రలో మండోదరిగా కాజల్ కనిపిం చనుందని టాక్ వినిపిస్తోంది. అంతే కాకుండా ఇటీవలే కాజల్‌పై లుక్ టెస్ట్ కూడా జరిగిందని, త్వరలోనే టీమ్ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటిం చబోతోందని ప్రచారం జరుగుతోంది.

ఇదే నిజమైతే -రామయణ -% అనుకున్న దానికి మించి భారీ స్థాయిలో ఉండ నుందనే కామెం ట్‌లు వినిపి స్తున్నాయి.

భారతీయ సినిమాల్లో బడ్జెట్ పరంగా సరికొత్త చరిత్రకు నాంది పల కను న్న ఈ ప్రాజెక్ట్ ఆర్టిస్ట్‌ల విషయం లోనూ చర్చ నీయాంశంగా మా రడం కాయం.

# డాన్' డెన్‌లో కృతి ఎంట్రీ ఎప్పుడంటే..!



బాలీవుడ్ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా అన్ని భాషల ప్రేక్షకులకు డాన్ సినిమా చాలా స్పెషల్ అనడంలో సందేహం లేదు. ఇప్పటి వరకు వచ్చిన డాన్ ఫ్రాంచైజీ సినిమాల్లో షారుఖ్ ఖాన్ నటించాడు. డాన్ ఫ్రాంచైజీ సినిమాలు సూపర్ హిట్ అయిన నేపథ్యంలో డాన్ 3 కోసం హిందీ ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డాన్ 2 వచ్చిన దాదాపు 15 ఏళ్ల తర్వాత డాన్ 3 సినిమా రాబోతుంది. డాన్ 3 సినిమాలో షారుఖ్ ఖాన్ కాకుండా బాలీవుడ్ మరో క్రేజీ హీరో రణ్వీర్ సింగ్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికే సినిమాను పట్టాలెక్కించారనే వార్తలు వస్తున్నాయి. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అధికారికంగా ప్రకటన కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందుతున్న డాన్ 3 సినిమాపై అంచనాలు ఇప్పటికే భారీగా పెరిగాయి. అంచనాలకు తగ్గట్లుగా సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్, టెస్ట్ షూట్, ప్రీ విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ నడుస్తున్నట్లు ఆ మధ్య చిత్ర యూనిట్ సభ్యుల్లో ఒకరు చెప్పుకొచ్చారు.

సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ఈ సినిమాలో రణ్వీర్ సింగ్‌కు జోడీగా ఆదిపురుష్ హీరోయిన్ కృతి సనన్ నటించబోతుంది. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న కృతి సనన్ డాన్ 3 సినిమాలో ఎంట్రీ ఇవ్వడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'తేరి ఇష్క్ మైన్' సినిమాలోనూ కృతి సనన్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. త్వరలోనే ధనుష్, ఆనంద్ ఎల్ రాయ్ సినిమా పూర్తి కానుంది. కృతి సనన్ ప్రస్తుతం ధనుష్ సినిమాపైనే దృష్టి పెట్టిందని, ఆ సినిమా పూర్తి అయిన తర్వాత డాన్ 3 సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తోంది. డాన్ 3 సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యే సమయంకు తేరి ఇష్క్ మైన్ సినిమా షూటింగ్ పూర్తి కావాలని కృతి సనన్ ఇప్పటికే నిర్మాతలతో చెప్పిందని సమాచారం అందుతోంది. ధనుష్ సినిమాలో కృతి సనన్ పాత్ర ఏంటా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కృతి సనన్ గత ఏడాదిలో తేరీ బాతోన్ మే ఐసా ఉలా జియా, క్రూ, దో పట్టి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలతో బాలీవుడ్‌లో మరింత బిజీ అయింది. అయితే డాన్ 3 సినిమాకు ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో వచ్చిన కొన్ని ఆఫర్లను కృతి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. డాన్ 3 సినిమా వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వస్తే, ఆ తర్వాత మరిన్ని సినిమాల్లో కృతి సనన్ నటించే అవకాశాలు ఉన్నాయి. నార్త్‌తో పాటు సౌత్ ఇండియాలోనూ వరుస సినిమాలు చేస్తూ, అక్కడ ఇక్కడ స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుని దూసుకు పోతున్న కృతి సనన్ మళ్లీ తెలుగులో ఎప్పుడు కొత్త సినిమాకు కమిట్ అవుతుందో చూడాలి.

# తీరిక లేని షెడ్యూళ్లతో నలిగిపోతున్న మిల్కీ



తీరిక లేని షెడ్యూళ్లతో నలిగి పోతున్న మిల్కీ 2005లో శ్రీ అనే చిత్రంతో కథా నాయికగా ఆరంగేట్రం చేసింది తమన్నా భాటియా. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ రన్ పూర్తి చేసింది. ఇలాంటి ఎగ్జయిటింగ్ కెరీర్ చాలా మంది సమకాలీన కథా నాయికలకు లేదు. కెరీర్ పోరాటం సాగించలేక మిడిల్ డ్రాప్ అయిన కథానాయికలు ఉన్నారు. కానీ ముంబై టు హైదరాబాద్ తమన్నా జర్నీ ఇంట్రెస్టింగ్. చాంద్ షా రోషన్ తమన్నాకు హిందీలో డెబ్యూ మూవీ. ఆ తర్వాత శ్రీ సినిమాతో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టి, హ్యాపీడేస్ తో సంతృప్తికరమైన విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా అగ్ర కథానాయకుల సరసన అవకాశాలు అందుకుంది. తెలుగు, తమిళంలో టాప్ హీరోయిన్ గా స్టార్ డమ్ అందుకున్న తమన్నా బాహుబలి లాంటి పాన్ ఇండియా సినిమాలోను నటించింది. అయితే తమన్నా కెరీర్ లో విజయాల కంటే ఫ్లాపులే ఎక్కువ. అందువల్ల ప్రతిసారీ తమన్నా పని అయిపోయింది! అంటూ మీడియాలో ప్రచారం సాగేది. కానీ అన్నిటినీ అధిగమించి కెరీర్ బెస్ట్ ఫేజ్ కి ఎదిగింది తమన్నా. టాలీవుడ్ కోలీవుడ్ లో అగ్ర హీరోలందరి సరసనా కథానాయికగా నటించింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా తమన్నా కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో వరుసగా అరడజను ప్రాజెక్టులతో బిజీ బిజీగా ఉంది. ఇటీవల ఆజ్ కీ రాత్.. నషా వంటి ఐటమ్ నంబర్లతోను తమన్నా మెరుపులు మెరిపించింది. హిమ్మత్ వాలా, రైడ్ 2 తర్వాత అజయ్ దేవగన్ తో కలిసి %-%రేంజర్%-% లో నటిస్తోంది. అడవి నేపథ్యంలో ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. అలాగే వేదా తర్వాత మరోసారి అబ్రహంజాన్ తో జతకట్టనుంది. సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జిత్ దోసాంజ్ లతో కలిసి రెండు వేర్వేరు ప్రాజెక్టులలోను నటిస్తోంది. వీటితో పాటు ఒక భారీ క్రేజీ వెబ్ సిరీస్ లోను తమన్నా భాగమైంది. కెరీర్ పరంగా ఇది బెస్ట్ ఫేజ్ అని తమన్నా భావిస్తోంది. టాలీవుడ్ లో ఓదెల 2 ఇటీవలే విడులైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పలువురు దర్శకులు తమన్నాకు స్క్రిప్టులు వినిపిస్తున్నారని సమాచారం. ఈ ఏడాది డిసెంబర్ తో తమన్నా 20 ఏళ్ల కెరీర్ ని దిగ్విజయంగా పూర్తి చేసుకోనుంది.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com